అమ్మాయిలకు అండగా ఉంటాం

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థినులకు ఆర్థికసాయం



అమ్మాయిలతో మాట్లాడుతున్న మంత్రి సవిత

పరిగి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థినుల చదువుకు అండగా ఉంటామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత భరోసా ఇచ్చారు. పరిగి మండల కేంద్రంలోని భజంత్రీ గోపాల్ రెండు రోజుల క్రితం మృతిచెందారు. ఎనిమిదేళ్ల క్రితం అతడి భార్య మృతిచెందారు. దీంతో ఇద్దరు కుమార్తెలు పెద్ద దిక్కును కోల్పోయారు. విషయం తెలుసుకున్న మంత్రి సోమవారం మృతుడి ఇంటి వద్దకు చేరుకున్నారు. గోపాల్ కూతురు అక్షిత హిందూపురంలోని సువర్ణభారతి జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీలో 440కి గాను 436 మార్కులు సాధించినట్లు చెప్పారు. మరో అమ్మాయి వందన పరిగి కేజీబీవీలో 9వతరగతి చదువుతోంది. తల్లిదండ్రులను కోల్పోయిన బాలికల చదువులు ముందుకు సాగించాలని మంత్రి లోకేష్ స్వయంగా తనను పంపించారని మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం పిల్లల బాధ్యత తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రూ.25వేలు ఆర్థికసాయం చేశారు. సువర్ణభారతి సంస్థల యజమాని నీలకంఠారెడ్డితో మంత్రి మాట్లాడి.. అక్షితకు సంబంధించి ఫీజు బకాయిలు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

స్ఫూర్తి పతాక.. దీపిక

భారత అంధుల టీ-20 క్రికెట్ జట్టు కెప్టెన్‌కు ఘన సన్మానం

దీపిక ప్రతిభను కొనియాడిన ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు సూచన



మాట్లాడుతున్న మంత్రి సవిత, వేదికపై క్రికెటర్ దీపిక, ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, పల్లె సింధూర, కలెక్టర్ శ్యాంప్రసాద్ తదితరులు

మడకశిర/టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతిభకు అంధత్వం అడ్డుకాదని నిరూపిస్తూ, దేశం గర్వించేలా టీ-20 క్రికెట్ ప్రపంచకప్ సాధించిన దీపిక ఎందరికో స్ఫూర్తి అని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. అంధుల టీ-20 క్రికెట్‌లో భారత జట్టును ప్రపంచ విజేతగా నిలిపిన కెప్టెన్ దీపికను సోమవారం మడకశిరలో ఘనంగా సన్మానించారు. స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సాధించాలి అన్న పట్టుదల ఉంటే ఎంతటి లక్ష్యాన్ని అయినా చేరుకోవచ్చని దీపిక నిరూపించిందన్నారు. హేళనలు పట్టించుకోకుండా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో అకుంఠిత దీక్షతో దేశ చరిత్రలో తనపేరును సువర్ణాక్షరాలతో లిఖించుకుందని ప్రశంసించారు. దేశ ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య వంటి గొప్ప వ్యక్తుల చేత మెప్పు పొందిన క్రీడాకారిణిగా దీపిక (మిగతా 6లో...)

ఈవో లీలలు..!

సస్పెండైన ఈవో మురళీక్రిష్ణ తీరు వివాదాస్పదం

విధుల కన్నా.. ఆర్జనకే ప్రాధాన్యం..?

పాలపాటిదిన్నెలో వైసీపీ నాయకుడితో కలిసి అడ్డగోలు దోపిడీ

తన పేరు మీదే రూ.2.5 లక్షల చెక్కు



ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయం

ఎర్రదొడ్డి గంగమ్మ అమ్మవారి ఆభరణాలు చోరీ చేస్తూ పట్టుబడిన ఈవో మురళీక్రిష్ణ తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమూహ ఆలయాలకు ఈవోగా వ్యవహరించిన ఆయన.. అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి. పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో ఓ వైసీపీ నాయకుడి ద్వారా అన్నింటా అక్రమాలకు పాల్పడ్డారని ఆలయ వర్గాలు పేర్కొంటున్నాయి. రూ.2.50 లక్షల చెక్కును తన పేరు మీద తీసుకోవడం గమనార్హం. విధులు పక్కన పెట్టి.. పైసల ఆర్జనకే ప్రాధాన్యమిస్తారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విరాళాలు లెక్క తప్పాయా.. అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కదిరి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆలయ ఆస్తులు, దేవుళ్ల ఆభరణాలు, భక్తులిచ్చే విరాళాలను పరిరక్షించాల్సిన ఈవోనే దోచేశాడు. పబ్లిక్‌గా అమ్మవారి ఆభరణాలను చోరీ చేసుకెళ్తూ పట్టుబడ్డాడు. కదిరి మండలంలోని ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయ ఈవో మురళీక్రిష్ణ ఆదివారం చేతివాటం ప్రదర్శించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఆయన కదిరి ప్రాంతంలోని ఏడు దేవాలయాలకు కార్యనిర్వాహణాధికారిగా వ్యవహరిస్తున్నారు. ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయంలోనే ఇంత దోచుకుంటే.. నల్లచెరువు మండలంలో ప్రసిద్ధిచెందిన పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి, మిగిలిన దేవాలయాల్లో ఎంత దోచుకున్నారో అని భక్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పాలపాటిదిన్నె ఆలయంలో ఈవోకి చేదోడుగా ఉంటున్న ఓ వైసీపీ నాయకుడు పెత్తనం చెలాయిస్తున్నాడు. అన్నదానం మొదలుకుని లడ్డూల వరకు అన్నింటా ఆయనదే హవా అన్న చర్చలు వినిపిస్తున్నాయి. భక్తులు సమర్పించిన సొమ్ములకు లెక్కాపత్రం లేకుండా పోయింది. స్వామివారికి అందే విరాళాలు కొంత అయితే, అధిక మొత్తంలో ఈవో, వైసీపీ నాయకుడు స్వాహా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్నదానంతోపాటు, స్వామివారిని ప్రత్యేక దర్శన టికెట్ల రూపంలో ప్రతి శనివారం రూ.30వేల వరకు ఆదాయం ఉంటుంది. శ్రావణమాసం అయితే వారం వారం రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతుంది. ఎర్రదొడ్డి గంగమ్మ అమ్మవారిని ప్రతి ఆది, మంగళవారాల్లో వివిధ రూపాల్లో అలంకరిస్తారు. గంగమ్మ వద్ద బలిచ్చే ప్రతి జంతువుకు రూ.వంద వసూలు చేస్తారు. వందల సంఖ్యలో బలులు జరుగుతుంటాయి. ఆ సొమ్ము అంతా ఎక్కడికి పోతుందో తెలియని పరిస్థితి. పాలపాటిదిన్నెలో అన్నదానానికి వచ్చిన భక్తులు విరాళాలు ఇస్తారు. అవి కొన్నింటికి రసీదులిస్తుంటే, మరికొన్నింటికి ఇవ్వకుండా ఈఓతోపాటు వైసీపీ నాయకుడు జేబుల్లోకి వేసుకుంటున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. శ్రావణమాసం (మిగతా 6లో..)

అర్జీలపై నిర్లక్ష్యం వద్దు: కలెక్టర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం ఎన్నో వ్యయప్రయాసలతో జిల్లా కేంద్రానికి వచ్చి ఇచ్చిన అర్జీలపై నిర్లక్ష్యం ప్రదర్శించకుండా పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 331 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. సంబంధిత శాఖల ఉన్నతాధికారులు కూడా ప్రజల అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్, డీసీఓ క్రిష్ణా నాయక్ పాల్గొన్నారు.

సైనికుల సేవలు వెలకట్టలేనివి

కలెక్టర్ శ్యాంప్రసాద్ 6

విద్యతోనే భవిష్యత్తు: డీఈఓ



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీఈఓ కిష్టప్ప

కొత్తచెరువు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యతోనే భవిష్యత్తు ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) కిష్టప్ప తెలిపారు. కౌశల్ 2025 జిల్లా స్థాయి పోటీల విజేతలకు స్థానిక డీఈవో కార్యాలయంలో సోమవారం నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలను ఆయన అందజేశారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరచి 12 మంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వారిలో మొదటి బహుమతి కింద ఆరుగురికి రూ.1500 చొప్పున, రెండో బహుమతికి ఎంపికైన ఆరుగురు విద్యార్థులకు రూ.1000 చొప్పున నగదుతోపాటు ప్రశంసాపత్రాన్ని డీఈఓ అందజేశారు. వీరు ఈనెల 27న తిరుపతిలోని జాతీయ సాంస్కృత విద్యాలయంలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి తనూజ్‌కుమార్, పెనుకొండ ఉప విద్యాశాఖ అధికారి జాన్‌రెడ్డప్ప, కౌశల్ నిర్వాహకులు మనోహర్, శ్రీనివాసనాయక్, పవన్‌కుమార్, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.



హైవేపై కారును అడ్డగించిన దుండగులు

హైవేపై దోపిడీ

రూ.3 కోట్ల హవాలా సొమ్ముతో పరార్

సూరత్ నుంచి బెంగళూరుకు వెళుతుండగా అటాక్

ఇద్దరు డ్రైవర్లను అపహరించి.. వదిలేసిన దుండగులు

పోలీసుల అదుపులో డ్రైవర్లు

రూ.1.2 కోట్లు, రెండు కార్ల స్వాధీనం

పెనుకొండ బాబయ్య దర్గాలో ఉరుసు. హైవేపై ఒకటే రద్దీ..! అదే సమయంలో జాతీయ రహదారిపై హల్‌చల్ చేసే బైక్ రైడర్ల కోసం పోలీసులు కాపు కాశారు. వారికి ఓ ఫోన్‌కాల్ వచ్చింది. 'పై జంక్షన్ వద్ద ఇద్దరిని కిడ్నాప్ చేశారు. ఐదు కార్లలో వచ్చి.. ఓ కారును అడ్డుకుని.. ఎత్తుకుపోయారు..' అని సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. వాహనాల తనిఖీ చేపట్టారు. పెనుకొండ ఆర్టీఓ కార్యాలయం వద్ద రెండు కార్లు కనిపించాయి. పోలీసులను చూడగానే ఓ కారులో ఎక్కి అందరూ పారిపోయారు. మరోకారును అక్కడే వదిలేశారు. అందులో ఉన్న రూ.1.20 కోట్ల నగదును కూడా..! ఈ నెల 3వ తేదీ తెల్లవారుజామున జరిగింది ఈ సంఘటన. హైవేపై వెళుతున్న ఓ టెకీ ఇచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు వేట ప్రారంభించి, కీలక సమాచారం సేకరించారు. సూరత్ నుంచి బెంగళూరుకు తరలుతున్న హవాలా సొమ్మును దోచుకున్నట్లు తేల్చారు. కారులో రూ.4.30 కోట్లు ఉండగా, పోలీసులు వెళ్లేలోగా రూ.3 కోట్లకుపైగా సొమ్మును తమ కారులోకి మార్చుకున్నారు.

(వివరాలు మెయిన్‌లో..)

మంచువర్ణ చిత్రం



ఇది కుంచె తిరిగిన కళాకారుడు గీసిన చిత్రం కాదు. ప్రకృతి చేసిన సిత్రం. కమ్మేసిన పొగ మంచుపై రవి కిరణాలు అరుణ వర్ణాన్ని వెదజల్లాయి. తెల్లటి దట్టంగా కప్పేసిన పొగమంచు.. మధ్యలో ఎర్రటి కిరణాలు కలియడంతో మంచు వర్ణ చిత్రంలా ఆహ్లాదాన్ని పంచింది. కదిరి వద్ద సోమవారం ఉదయం ఈ మంచు మాయను చూసి.. అందరూ ఆశ్చర్యపోయారు.

-కదిరి (ఆంధ్రజ్యోతి)

ఎర్రదొడ్డి ఆలయ

ఈవో అరెస్టు

5.573 కిలోల వెండి, 15 చీరలు, 1.980 గ్రాముల బంగారం స్వాధీనం

-7లో...



పోలీసుల అదుపులో నకిలీ నోట్ల ముఠా

బత్తలపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకటగారిపల్లి క్రాస్ వద్ద నకిలీనోట్ల ముఠాను పోలీసులు సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు, కడప జిల్లా తాళ్ల ప్రొద్దుటూరుకు చెందిన అంజి, చామూరుకు చెందిన ఓబులేసు, బోడాయపల్లికి రెందిన రాజకుల్లయప్ప నకిలీ నోట్లను అదే జిల్లా కమలాపురం మండలం నల్ల లింగాయపల్లికి చెందిన వీరాంజినరెడ్డికి ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. అసలు నోట్లు రూ.లక్ష తీసుకుని, రూ.3 లక్షల నకిలీ నోట్లను గత నెల 19న ఇచ్చారు. వీటిని మార్చే ప్రయత్నం చేసిన వీరాంజినరెడ్డికి చుక్కెదురైంది. నకిలీ నోట్లను జనం సులభంగా గుర్తించడంతో మార్చడం సాధ్యం కాలేదు. దీంతో ఆగ్రహించిన వీరాంజినరెడ్డి, నకిలీ నోట్లు సమకూర్చిన ముగ్గురినీ నిలదీశాడు. ఈ క్రమంలో ఇరువర్గాలవారు వెంకటగారిపల్లి క్రాస్ వద్ద సోమవారం రాత్రి గొడవపడ్డారు. పరస్పరం దాడులు చేసుకున్నారు. దాడిలో గాయపడిన వీరాంజనరెడ్డి, డయల్ 100కు సమాచారం ఇచ్చాడు. బత్తలపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలవారిని అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నారు.

దివ్యాంగుల చెంతకే ఎస్పీ

సమస్యలు పరిష్కరిస్తామని హామీ



దివ్యాంగుడితో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చే సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని ఎస్పీ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. సమస్యలపై వచ్చిన బాధితులతో ఎస్పీ మాట్లాడారు. పోలీసు కాన్ఫరెన్స్ హాలులోకి రాలేని దివ్యాంగుల వద్దకే ఎస్పీ నేరుగా వెళ్లి ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలను పరిష్కరిస్తానని వారికి భరోసానిచ్చారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కుటుంబ కలహాలు, భూసమస్యలు, భార్యాభర్తల గొడవలు, సైబర్‌నేరాలు, వంటివాటిపై 114 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, మహిళా డీఎస్పీ ఇందిర, ఎస్సీ ఎస్టీ సెల్ సీఐ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

శిథిల భవనాలు..!

ఊడిన పెచ్చులు.. కారుతున్న కార్యాలయాలు

పాఠశాలల పరిస్థితి దయనీయం

బిక్కుబిక్కుమంటూ విధులు

నల్లచెరువు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల క్రితం నిర్మించిన అనేక ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. నల్లచెరువు మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల భవనాలు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. పైపెచ్చులూడి మీద పడుతున్నా ఉద్యోగులు, సిబ్బంది విధులు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. గోడలు పైకి బాగానే కనిపిస్తున్నా పైకప్పు పెచ్చులూడి కడ్డీలు దర్శనమిస్తున్నాయి. వర్షం వచ్చిందంటే కార్యాలయం మొత్తం తడిసి ముద్దవుతోంది. ఈ భవనానికి ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. మండల కేంద్రంలో 25 సంవత్సరాల క్రితం నిర్మించిన గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు పెచ్చులూడి కడ్డీలు కనిపిస్తున్నాయి. వర్షం వస్తే పుస్తకాలు తడిసిపోతున్నాయి. పశువుల ఆసుపత్రి భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. ఈ ఆసుపత్రిని 50 సంవత్సలరాల క్రితం నిర్మించారు. వర్షం పడిందంటే ఆసుపత్రిలో మోకాలు లోతు నీరు నిలుస్తోంది. భవనానికి పైకప్పు పెచ్చులూడి కూలడానికి సిద్ధంగా ఉంది. రాగన్నగారిపల్లి మండల పరిషత్ పాఠశాల శిథిలమై ఎప్పుడు కూలుతుందో అన్న విధంగా మారింది. ఈ భవనంలో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువులు కొనసాగిస్తున్నారు. రవణప్పగారిపల్లి పాఠశాల ప్రహరీ కూలిపోయింది. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రతి రోజూ వందల మంది రోగులు వస్తుంటారు. వర్షం పడిందంటే ఆసుపత్రి భవనం పైకప్పు కారుతోంది. ఈ భవనాలకు మరమ్మతులు చేపట్టాలని, నూతన భవనాలు నిర్మించాలని ఆయా శాఖల ఉద్యోగులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



నల్లచెరువు మండలంలో రాగన్నగారిపల్లి, కొత్తపల్లి, రవణప్పగారిపల్లిలో పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఆ పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు ఒకే భవనంలో అన్ని తరగతులు నిర్వహించడం విద్యార్థులకే కాకుండా ఉపాధ్యాయులకు కూడా కష్టంగా ఉంది. కొత్త భవనాలు నిర్మించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే నూతన భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

-తిరుపాల్ నాయక్, ఎంఈఓ



రవణప్పగారిపల్లిలో పెచ్చులూడిపోయిన పాఠశాల భవనం పైకప్పు



పశువైద్యశాల భవనంలో మర్రి ఊడలు

రాయలసీమలో వందేమాతరం స్ఫూర్తి

● లోక్‌సభలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



అనంతపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వందేమాతర గీతం స్ఫూర్తి దేశంలోని సుదూర ప్రాంతాలకు సైతం చేరిందని, రాయలసీమకు, మరీ ముఖ్యంగా అనంతపురం జిల్లాకు విస్తరించిందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. దేశభక్తికి ప్రతీకగా నిలిచిన 'వందేమాతరం' జాతీయ గీతాన్ని రచించి 150 ఏళ్లు అయిన సందర్భంగా లోక్‌సభలో సోమవారం జరిగిన ప్రత్యేక చర్చలో ఆయన పాల్గొన్నారు. రాయలసీమ ప్రాంత పోరాట స్ఫూర్తిని, వీరగాథలను ఆయన ప్రస్తావించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని తాడిపత్రి, పెద్దవడుగూరు, హిందూపురం ప్రాంతాలను మహాత్మా గాంధీజీ సందర్శించారని, స్వాతంత్ర్యోద్యమంలో చేరాలని ప్రజలకు పిలుపునిచ్చారని అన్నారు. 1946లో బ్రిటీష్‌వారు అనంతపురం నుంచి బళ్లారికి అటవీ సంపదను తరలిస్తుంటే.. అడ్డుకునేందుకు కొత్తపల్లి గ్రామస్థులు ఒక వంతెనను ధ్వంసం చేశారని, అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించారని అన్నారు. దీనికి ఆగ్రహించిన బ్రిటీష్ ప్రభుత్వం గ్రామస్థులకు రూ.5 వేల భారీ జరిమానా విధించారని అన్నారు. స్వాతంత్ర్యానంతరం ఆ సొమ్మును భారత ప్రభుత్వం ఆ గ్రామానికి తిరిగి చెల్లించిందని, గ్రామస్థులు ఆ సొమ్ముతో ఊరిలో ప్రాథమిక పాఠశాలను నిర్మించారని, ఇది వందేమాతరం స్ఫూర్తికి నిదర్శనమని కొనియాడారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వందేమాతరం గీతానికి ఆకర్షితులై, యుక్త వయసులోనే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని వీరమరణం పొందారని, తెలుగు వారి పౌరుషం ఎలా ఉంటుందో చాటి చెప్పారని అన్నారు. వందేమాతరం ఆత్మ సామాన్య ప్రజల్లోనూ సజీవంగా ఉందని అన్నారు.

నిర్దిష్ట వ్యవధిలో పరిష్కారం: ఎస్పీ

అనంతపురం క్రైం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలకు నిర్దిష్ట వ్యవధిలోగా పరిష్కారం చూపుతామని ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయన పీజీఆర్ఎస్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలతో అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలపై స్వేచ్ఛగా అర్జీలు అందించవచ్చునన్నారు. బాధితులు ఎవరైనా, దేనికీ భయపడకుండా నేరుగా పోలీస్ అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రజాసేవే ధ్యేయంగా పోలీస్‌శాఖ పని చేస్తుందన్నారు. అర్జీలకు చట్టపరిధిలో వేగంగా పరిష్కారం చూపుతామని ఆయన తెలిపారు. కాగా 128 అర్జీలను ప్రజల నుంచి వచ్చినట్లు ఎస్పీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో డీఎస్పీ మహబూబ్‌బాషా, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రేపట్నుంచి టెట్: కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురం అర్బన్, కొత్తచెరువు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 10 నుంచి 21వతేదీ వరకు టెట్ నిర్వహిస్తామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం టెట్ నిర్వహణపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఏడు పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశామని, సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలో 4,520 మంది టెట్‌కు హాజరవుతారని డీఈవో కిష్టప్ప తెలిపారు. పుట్టపర్తి, బెంగుళూరులో ఒక్కో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. అభ్యర్థులు గుర్తింపుకార్డులతో గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

ఈవో లీలలు



పాలపాటిదిన్నె ఆలయం

(5వ పేజీ తరువాయి)

పూర్తయ్యాక కూడా ఈవో సొంతంగా ఈ ఏడాది ఆగస్టు 18న చెక్కు ద్వారా రూ.2.50 లక్షలు డ్రా చేసుకున్నారు. ఆలయంలో ఖర్చులు, వస్తువుల కొనుగోళ్లకు చెక్కులు వారి పేరుతో ఇస్తారు. ఈవో మురళీక్రిష్ణ ఏకంగా రూ.2.50 లక్షలు తన పేరుతో డ్రా చేసుకున్నారు. ఆ సొమ్ము ఎందుకు ఖర్చుపెట్టారో తేలాల్సి ఉంది. ఇలాంటివి కోకొల్లలు అని ఆయా ఆలయాల సిబ్బంది పేర్కొంటున్నారు. పాలపాటిదిన్నె, ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయాల్లో భక్తులిచ్చే విరాళాల లెక్క తప్పిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాలపాటిదిన్నెలో అధికారికంగా ఒక విరాళాల పుస్తకం రాస్తే, ఆలయంలో హవా నడిపిస్తున్న వైసీపీ నాయకుడు, ఈఓ సొంతంగా ముద్రించుకున్న మరో పుస్తకాన్ని వినియోగిస్తున్నట్లు తెలిసింది. ఈఓ ఎడాపెడా ఆలయ సొమ్ము ఖర్చు చేస్తున్నట్లు సమాచారం.

ఈఓ పనితీరు సరిగాలేదు



సస్పెండైన ఈవో మురళీక్రిష్ణ పనితీరు సరిగాలేదు. గతంలో ఇక్కడ పనిచేసిన ముగ్గురు ఈఓలు బాధ్యతగా ఉండేవారు. పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాసం ఉత్సవాలపై ఎంతో నిబద్ధతతో పనిచేసేవారు. మురళీక్రిష్ణ మాత్రం తాము ఎన్నిమార్లు చెప్పినా, శ్రావణమాసం ఉత్సవాల్లో పెద్దగా స్పందించింది లేదు. రెండుమూడురోజులకోసారి అలా వచ్చి.. ఇలా వెళ్లేవారు. శ్రావణమాస ఉత్సవాలు స్థానికంగా ఉన్న సిబ్బందితోనే పూర్తి చేశాం.

- ఆంజనేయదాస్, పాలపాటిదిన్నె ఆలయ ప్రధాన అర్చకుడు

రామగిరి డీటీ అరెస్టు

అతడి తల్లిదండ్రులు కూడా..

అమూల్య, ఆమె కొడుకు మృతి కేసులో 14 రోజుల రిమాండ్

అనంతపురం క్రైం, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): నగరంలో కుమారుడిని చంపి అమూల్య ఉరి వేసుకున్న కేసులో ఆమె భర్త రామగిరి డిప్యూటీ తహసీల్దార్ బండమీద రవిని పోలీసులు అరెస్టు చేశారు. అనంతపురం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ శ్రీనివాసరావు సోమవారం వెల్లడించారు. గతనెల 27వ తేదీన నగరంలోని జేఎన్టీయూ రోడ్డులో గల ఇంట్లో నాలుగేళ్ల కుమారుడి గొంతు కోసి, అమూల్య ఆత్మహత్య చేసుకుంది. దీనిపై అమూల్య తండ్రి రామకృష్ణయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. అందులో భాగంగా అమూల్య భర్త రవి, అత్తమామలు శివాంజినమ్మ, కుళ్లాయప్పను అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా.. 14 రోజుల రిమాండ్ విధించింది.

రెండు రైళ్ల రద్దు

గుంతకల్లు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నిర్వహణ కారణాలతో చర్లపల్లి-యల్హంక-చర్లపల్లి ప్రత్యేక రైళ్లను ఒక్కో ట్రిప్పు చొప్పున రద్దుపరచినట్లు రైల్వే అధికారులు సోమవారం ప్రకటనలో తెలిపారు. చర్లపల్లి-యల్హంక ప్రత్యేక రైలు (నం. 07187)ను 8వ తేదీన, యల్హంక-చర్లపల్లి ప్రత్యేక రైలు (నం. 07188)ను 9న రద్దు చేశారు. ఆపరేషనల్ రీజన్స్‌తో రద్దయిన రైళ్ల విషయాన్ని గమనించి ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

స్ఫూర్తి పతాక.. దీపిక

(5వ పేజీ తరువాయి)

నిలిచిందన్నారు. ఆమె ప్రతిభకు ప్రోత్సాహకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.10లక్షలు, మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు రూ.2లక్షలు, తాను రూ.2.16లక్షలు ఇస్తున్నట్లు తెలిపారు.

కష్టపడితే ఏదైనా సాధ్యమే..: ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

లక్ష్యం చేరాలనే సంకల్పం ముందు పేదరికం, దివ్యాంగత్వం వంటివి ఏవీ అడ్డురావని, కష్టపడితే సాధించలేదని ఏమీ ఉండదని నిరూపించిన క్రీడాకారిణిగా దీపిక నిలిచారని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. ప్రపంచపటంలో మడకశిర పేరును నిలిపిన దీపికను మనందరం సత్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మడకశిర ప్రాంత విద్యార్థులు మరో దీపికలా విజయాలను అందుకొని ఈప్రాంతానికి కీర్తిని తీసుకురావాలని కోరారు.

రోల్ మోడల్: సింధూరారెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే

దీపిక అంధుల టీ-20 ప్రపంచకప్‌ను భారత్‌కు అందించి రోల్‌మోడల్‌గా నిలిచారని పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరారెడ్డి అన్నారు. అనుకొన్నది సాధించడానికి పేదరికం, దివ్యాంగత్వం, హేళనలు అడ్డుకాదని నిరూపించిన దీపిక ఎందరి కో ఆదర్శంగా నిలిచారన్నారు. విద్యార్థులు ఆమె స్ఫూర్తిగా రాణించాలన్నారు.

మట్టిలో మాణిక్యం: సాయికుమార్, సినీనటుడు

మన మట్టిలో పుట్టిన మాణిక్యం దీపిక అని ప్రముఖ సినీ నటుడు సాయికుమార్ ప్రశంసించారు. ప్రతి విద్యార్థి దీపికను స్ఫూర్తిగా తీసుకుని రాణించాలన్నారు. మొట్టమొదటి అంధుల టీ-20 ప్రపంచకప్పును అందించి దేశం అంతా తనవైపు చూసేలా నిలిచిన గొప్ప క్రీడాకారిణి దీపిక అని అన్నారు.

ఆత్మస్థైర్యంతో..: గుండుమల, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఆత్మస్థైర్యం, బలమైన విశ్వాసంతో ముందుకు సాగితే సాధించలేనిది ఏమీ లేదని దీపిక నిరూపించిందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. మడకశిర పేరును ప్రపంచస్థాయిలో పరిచయం చేసిన దీపిక ప్రతిభ ప్రశంసనీయమన్నారు. దీపికను అందరూ స్ఫూర్తిగా తీసుకొని ఎదగాలన్నారు.

నిరంతర కృషితోనే గుర్తింపు: కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్

నిరంతరం కృషి, పోరాటం వల్ల దీపిక తాను అనుకొన్న లక్ష్యాన్ని సాధించారని కలెక్టర్ శ్యాంప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌లు అన్నారు.



దీపికకు క్రికెట్ బ్యాట్లతో గౌరవ వందనం

దీపిక సన్మాన సభలో వారు మాట్లాడుతూ హేళనలు ఎదురైనా నిరుత్సాహపడకుండా కలలుగన్న లక్ష్యాన్ని దీపిక చేరారని ప్రశంసించారు. ఆమె ప్రతిభ ముందు అంధత్వం కూడా చిన్నబోయిందన్నారు. ప్రతి ఇబ్బందిని అవకాశంగా మలుచుకుని నేడు భారత జట్టును ప్రపంచ విజేతగా నిలిపిందని అభినందించారు. ఇంతటి ప్రతిభాశాలి మడకశిరకు చెందిన యువతి కావడం ఇక్కడి ప్రజలకు గర్వకారణమన్నారు.

అడుగడుగునా నీరాజనం

మడకశిర నియోజకవర్గం అమరాపురం మండలం తంబాళహట్టి గ్రామానికి చెందిన దీపిక భారత అంధుల టీ-20 జట్టు కెప్టెన్‌గా ప్రపంచకప్ సాధించి తొలిసారి సోమవారం మడకశిరకు వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో భారీ అభినందన ర్యాలీని నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరారెడ్డి, సినీనటుడు సాయికుమార్‌తో కలిసి దీపిక ర్యాలీలో పాల్గొన్నారు. అడుగడుగునా పూలవర్షం కురిపిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు క్యాంప్ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమైంది. రాజీవ్‌గాంధీ సర్కిల్‌మీదుగా మడకశిర జూనియర్ కళాశాల మైదానం వరకు వేలాది మంది విద్యార్థులు, క్రీడాకారుల నడుమ ర్యాలీ సాగింది. అనంతరం జూనియర్ కళాశాల మైదానంలో సన్మాన సభ నిర్వహించారు. కార్యక్రమంలో కోచ్ మహంతేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్మన్ నరసింహరాజు, మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ భక్తర్ పాల్గొన్నారు.

అవమానాలు, విమర్శలు అధిగమించి..: దీపిక, అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్



చిన్నప్పటి నుంచి ఎదురైన అవమానాలు, విమర్శలు నాలో పట్టుదలను పెంచాయి. దాని ఫలితమమే నేటి నా విజయమని అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక అన్నారు. 2019లో కర్ణాటకలో అంధుల క్రికెట్ జట్టుకు ఎంపిక కావడం, కోచ్ మహంతేష్ సహకారం వల్లే జాతీయ జట్టుకు సారథ్యం వహించే సామర్థ్యం వచ్చినట్లు తెలిపారు. అందరి సహకారం వల్లే మొదటిసారి జరిగిన అంధుల టీ-20 ప్రపంచకప్‌లో జట్టును విజేతగా నిలిపినట్లు పేర్కొన్నారు. కప్పు సాధించడం పట్ల ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, మడకశిర ప్రాంత ప్రజలు చూపిన ఆదరణ జీవితంలో మరువలేనన్నారు. ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సహకారం కూడా మరువలేనన్నారు.



దీపికకు చెక్కు అందజేస్తున్న మంత్రి సవిత



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, క్రీడాకారులు

నో రికవరీ..!

ఆకుతోటపల్లిలో రూ.17లక్షలు స్వాహా

సొంత ఖాతాల్లోకి జమచేసుకున్న మాజీ యానిమేటర్, మరో లీడర్

పోలీసులకు ఫిర్యాదుతో సరిపెట్టిన అధికారులు

అనంతపురంరూరల్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల సభ్యుల సొమ్ము స్వాహాపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అనంతపరం రూరల్ మండలంలోని ఆకుతోటపల్లి మహిళా సంఘాలకు సంబంధించిన రూ.17 లక్షలకు పైగా డబ్బును మాజీ యానిమేటర్‌తో పాటు ఓ గ్రూపు లీడరు కాజేశారు. గ్రూపు సభ్యులకు తెలియకుండా సొంత ఖాతాల్లోకి జమచేసుకున్నారు. సంబంధిత అధికారుల విచారణలో కూడా వ్యవహారం బట్టబయలయింది. ఆ మేరకు సదరు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదంతా జరిగి మూడు నెలలు గడిచిపోయింది. ఇంత వరకు సొమ్ము రికవరీపై ఒక్క అడుగు ముందుకు పడలేదు. పోలీసుల తీరు అంతకంటే అధ్వానంగా ఉందని మహిళా సంఘాల సభ్యులు వాపోతున్నారు.



వెన్నెల మండల సమైక్య కార్యాలయం

రూ.17.63 లక్షలు స్వాహా

ఆకుతోటపల్లిలో జనని గ్రామ సంఘం తరఫున 30, అశ్వని గ్రామ సంఘం తరుఫున 55 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలోని 8 స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన సభ్యుల సొమ్మును మాజీ యానిమేటర్ శ్రీలేఖ, ఓ సంఘం లీడర్‌గా వ్యవహరించిన షాహీదా స్వాహా చేశారు. గ్రూపు సభ్యులకు తెలియకుండా తమ సొంత ఖాతాల్లోకి రూ.17,63,800 జమ చేసుకున్నారు. ఈ సొమ్ములో రూ.7.62లక్షలు యానిమేటర్ తన వ్యక్తి గత బ్యాంకు ఖాతాకు జమ చేసుకుంది. మిగతా సొమ్మును తన వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నట్లు సంబంధిత అధికారుల విచారణలో బయటపడింది.

ఫిర్యాదుతో సరిపెట్టిన అధికారులు

మహిళా సంఘాలకు సంబంధించిన సొమ్ము స్వాహా వ్యవహారం ఆగస్టులో బయట పడింది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు విచారణ చేపట్టారు. ఆ మేరకు నిధుల స్వాహా నిజమేనని నిర్ధారించారు. సెప్టెంబరులో ఇటుకలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసి అంతటితో అధికారులు సరిపెట్టుకున్నట్లు తెలుస్తోంది. సొమ్ము రికవరీలో జరుగుతున్న జాప్యంపై మహిళా సంఘాల సభ్యులు ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు పోలీసుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు. సొమ్ము కాజేసిన యానిమేటర్‌ను రెండు, మూడుసార్లు పోలీసులకు పట్టించినా ప్రయోజనం లేకుండాపోయిందని వారు చెబుతున్నారు. ప్రస్తుతం యానిమేటర్, లీడర్ ఇద్దరూ పరారీలో ఉన్నారంటూ పోలీసులు చెబుతున్నారని మహిళా సంఘాల సభ్యులు అంటున్నారు. ఏమైనా మాట్లాడితే.. మీరే పట్టుకురండి అంటూ పోలీసులు మాట్లాడుతున్నారని మహిళా సంఘాల సభ్యులు వాపోతున్నారు.

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు



సంఘంలో తీసుకున్న అప్పులు చెల్లించేందుకు నానా అవస్థలు పడుతున్నాం. ఇప్పుడు సంఘంలో తొమ్మిది మంది సభ్యులకు సంబంధించి రూ.4లక్షలు సొమ్మును యానిమేటర్ కాజేసింది. ఏం చేయాలో తెలియని పరిస్థితి. సంఘాల్లో జరిగిన విషయం గురించి కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేశాం. అయినా ప్రయోజనం లేకుండాపోయింది.

-సావిత్రమ్మ, సభ్యురాలు, ఆరుణోదయ గ్రూపు

పోలీసులకు ఫిర్యాదు చేశాం

ఆకుతోటపల్లిలో జనని, అశ్వని గ్రామ సంఘంలోని 8 సంఘాలల్లో రూ.17 లక్షలు దుర్వినియోగం జరిగింది. గతంలో పనిచేసిన యానిమేటర్ శ్రీలేఖ, మరో సంఘం లీడర్ షాహీదా సొంత ఖాతాల్లోకి జమ చేసుకున్నారు. దుర్వినియోగమయిన సొమ్ములో యానిమేటర్ నుంచి రూ.1.80 లక్షలు, సంఘం లీడర్ నుంచి రూ.లక్ష రికవరీ చేశాం. స్వాహాపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. బ్యాంకర్లతోనూ మాట్లాడి సంఘం సభ్యులను ఇబ్బంది పెట్టొదని కోరాం.

-రవి, ఏపీఎం

రెండు, మూడు సార్లు పట్టించాం



రాత్రిళ్లు మేలుకుని సొమ్ము కాజేసిన యానిమేటర్‌ను పట్టుకుని పోలీస్టేషన్‌కు అప్పగించాం. అయినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇంత వరకు ఒక్కరుపాయి కూడా వసూలయింది లేదు. పోలీసుల నుంచి సరైన సమాధానం లేదు. చేసేదిలేక ఇటీవల ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిశాం. న్యాయం జరిగేవిధంగా చూస్తామని హామీ ఇచ్చారు.

-రామలక్ష్మి, సభ్యురాలు, రాఘవేంద్ర గ్రూపు

సైనికుల సేవలు వెలకట్టలేనివి

కలెక్టర్ శ్యాంప్రసాద్



విద్యార్థులతో కలెక్టర్

పుట్టపర్తి టౌన్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో ప్రాణాలను లెక్కచేయకుండా సరిహద్దులో కాపలా కాస్తున్న సైనికుల సేవలు వెలకట్టలేనివని కలెక్టర్ శ్యాంప్రసాద్ కొనియాడారు. కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప ఆధ్వర్యంలో సోమవారం సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాయుధ దళాల పతాక దినోత్సవాలను ప్రారంభించారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, వివిధ శాఖల జిల్లా అధికారులు తమ వంతు విరాళాన్ని అందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సైనికుల కుటుంబాలకు అండగా నిలవడం ప్రతిపౌరుడి కర్తవ్యమన్నారు. ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు, సేవాసంస్థలు విరాళాలు అందించి, సైనికుల సంక్షేమానికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కలెక్టరేట్‌లో బాల్య వివాహ ముక్త భారత్-100 రోజుల కార్యక్రమంలో భాగంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాను బాల్య వివాహ రహితంగా తీర్చిదిద్దడానికి ప్రతి అధికారి, స్వచ్ఛంద సంస్థ, గ్రామస్థాయి సిబ్బంది సమష్టిగా కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లా అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జేసీ మౌర్యభరద్వాజ్, ఆర్డీఓ సువర్ణ, ఐసీడీఎస్ పీడీ ప్రమీల, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఈఓ కిష్టప్ప, డీసీపీఓ మహేష్, ప్రొటెక్షన్ ఆఫీసర్ మురళీధర్ పాల్గొన్నారు.

ఏమవుతుందిలే అనుకున్నారేమో..!

- ఎల్‌ఆర్ఎస్‌కు కొరవడిన స్పందన
- పట్టణంలో వందల అక్రమ ప్లాట్లు
- పదుల సంఖ్యలో దరఖాస్తులు
- మున్సిపల్ ఆదాయానికి భారీ గండి
- జనవరి 23తో ముగియనున్న గడువు

కదిరి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించడానికి ప్రభుత్వం తీసుకొచ్చిన ఎల్‌ఆర్ఎస్(లే అవుట్ రెగ్యులరైజేషన్ సిస్టమ్)కు స్పందన కొరవడింది. వందల సంఖ్యలో ఉన్న ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు పదుల సంఖ్యలో మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. ప్లాట్ల రెగ్యులరైజ్ చేసుకోవడానికి 2026 జనవరి 23 వరకు సమయం ఇచ్చింది. ఇందుకోసం ప్రభుత్వం అనేక రాయితీలు కూడా ప్రకటించింది. గతంలో ఉన్న 14 శాతం చార్జీలను 7శాతానికి తగ్గించింది. దీంతో పన్నులు కట్టే వాటిలో కూడా 5శాతం రాయితీని ప్రకటించింది. మొత్తం మీద సగం ధరకే ప్లాట్లు రెగ్యులరైజ్ అయ్యే అవకాశముంది. అయితే అక్రమ లేఅవుట్లు వేసిన యజమానుల నుంచి స్పందన కొరవడింది. అధికారులు మొద్దునిద్రలో ఉండటంతో ఎల్‌ఆర్ఎస్ ద్వారా మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది.

స్పందించని అక్రమార్కులు

పట్టణంలో వందల సంఖ్యలో క్రమబద్ధీకరణకు నోచుకోని ప్లాట్లు ఉన్నాయి. ప్రభుత్వం 2020లో క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించడంతో 218మంది దరఖాస్తు చేసుకున్నారు. దీనిద్వారా మున్సిపాలిటీకి రూ.1.32 కోట్ల ఆదాయం వచ్చింది. 2025లో మరోసారి ఎల్‌ఆర్ఎస్‌కు ప్రభుత్వం అనుమతించింది. 78 లేఅవుట్లలో అనుమతి లేని ప్లాట్లు ఉన్నాయి. వాటిని రెగ్యులరైజ్ చేసుకోవాలి. ఇప్పటివరకు 37 దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. వాటి ద్వారా రూ.23లక్షల ఆదాయం వచ్చినట్లు చెప్పారు. అక్రమ లేఅవుట్ల వల్ల మున్సిపల్ ఆదాయానికి పెద్ద ఎత్తున గండిపడుతోంది. పట్టణ పరిధిలో దాదాపు 13వందల ప్లాట్ల వరకు రెగ్యులరైజ్ కావాల్సి ఉంది. ఇవన్నీ రెగ్యులరైజ్ అయితే మున్సిపాలిటీకి రూ.5కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.



ఎన్జీవో కాలనీ సమీపంలోని లేఅవుట్‌లో రాళ్లను తొలగిస్తున్న ఎక్స్‌కావేటర్ (ఫైల్)

మొద్దు నిద్రలో మున్సిపల్ అధికారులు

మున్సిపల్ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడుతున్నా, అధికారులు మాత్రం మొద్దు నిద్రను వీడకుండా ఉన్నారు. ఎల్‌ఆర్ఎస్ గురించి ఏమాత్రం ప్రచారం చేయడం లేదు. అక్రమ లేఅవుట్లు వేసిన యజమానులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీని వెనుక ఆంతర్యమేమిటో అర్థం కాని విషయం. అక్రమ లేఅవుట్లలో ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్, ఈసీ ప్లాన్ మంజూరు చేయకూడదని స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఇదివరకే అధికారులను గట్టిగా హెచ్చరించారు. ఇందుకోసం ప్రత్యేకంగా రియల్టర్లు, ప్లాట్లు కొన్నవారితో సమావేశం నిర్వహించారు. కొంతమంది రియల్ ఎస్టేట్ పేరుతో మాయమాటలు చెప్పి ప్లాట్లు అమ్మేశారని అప్పుడే చెప్పారు. రెగ్యులరైజ్ చేసుకోవాలంటే లేఅవుట్ మొత్తం చేసుకోవాలని తెలిపారు. దీంతో అక్రమార్కులు తమ మోసపు వ్యాపారాలను నిలిపివేశారు. ప్రభుత్వం ఎల్‌ఆర్ఎస్ అనుమతించినా, వీరు ముందుకు రాకపోవడం ఏంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అందుకే ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు అక్రమ లేఅవుట్లు వేసినవారిపై వత్తిడి తెచ్చి రెగ్యులరైజేషన్ చేయించేలా ఒత్తిడి తేవాలని ప్రజాప్రతినిధులు సూచిస్తున్నారు.

చర్యలు తప్పవు: కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్



అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు గడువులోపు క్రమబద్ధీకరించుకోవాలి. అలా చేయకపోతే చర్యలు తప్పవు. ఫిబ్రవరి వరకు అక్రమ లేఅవుట్లలో ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవడానికి అవకాశముంది. ప్రతి ఒకరు రెగ్యులరైజ్ చేసుకోవాలి. స్థల యజమానులకు అవగాహన కోసం వివిధరకాల పద్ధతుల్లో ప్రచారం చేస్తున్నాం.

క్రైం కార్నర్

ఊడిన స్కూల్ బస్సు చక్రం

● విద్యార్థులకు తప్పిన ప్రమాదం



టైరును తోసుకుంటూ వస్తున్న పాఠశాల విద్యార్థులు

కళ్యాణదుర్గం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాగానిపల్లి పరిసర ప్రాంతంలో సోమవారం ఉదయం ఓ ప్రైవేటు స్కూలు బస్సు వెనుక చక్రం ఊడిపోయింది. అయితే బస్సులోని విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన చైతన్య టెక్నో స్కూలు బస్సు సోమవారం ఉదయం విద్యార్థులను తీసుకుని పాఠశాలకు బయల్దేరింది. మార్గమధ్యలో వెనుక చక్రం ఊడిపోయింది. ఆ సమయంలో బస్సులో 35 మంది విద్యార్థులు ఉన్నారు. చక్రం ఊడిపోయిన విషయం గమనించని డ్రైవర్ బస్సును అలాగే ముందుకు పోనిచ్చాడు. అయితే పిల్లలు గమనించి కేకలు వేయడంతో డ్రైవర్ బస్సును ఆపాడు. ఎవరికీ ఎలాంటి అపాయం జరగకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు. కండిషన్‌లో లేని బస్సులు తిప్పడం వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని స్థానికులు పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఊడిన చక్రాన్ని విద్యార్థులే రోడ్డుపై దొర్లించుకుంటూ బస్సు వద్దకు తీసుకొస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

అమ్మ కాలేక...!

● ఆత్మహత్య చేసుకున్న మహిళ



మృతిచెందిన ప్రశాంతి

సోమందేపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అమ్మతనం కోసం ఎంతగా పరితపించిందో ఏమో ఆ ఇల్లాలు..? పిల్లలు కలగాలని ఉదయమే భర్తతో కలిసి గ్రామంలోని ఆంజనేయస్వామి గుడికి వెళ్లి పూజలు చేసింది. తర్వాత నవ్వుతూ భర్తను పనికి సాగనంపింది. తర్వాత తన తల్లికి ఫోన్ చేసి సంసార బాధల గురించి ఆవేదన వ్యక్తం చేసింది. కుమార్తె మాటలతో కంగారు పడిన ఆ తల్లి పరుగు పరుగున బిడ్డ ఇంటికి చేరుకుంది. తలుపు తీసి విగతజీవిగా పడి ఉన్న బిడ్డను చూసి బోరున విలపించింది. ఈ సంఘటన మండలంలోని మండ్లి గ్రామంలో సోమవారం ఉదయం జరిగింది. పోలీసులు, బంధువుల కథనం మేరకు మండలంలోని చాలకూరుకు చెందిన ప్రసాద్, జయమ్మ దంపతుల ఒక్కగానొక్క కుమార్తె ప్రశాంతి(25)ని మూ డేళ్ల కిందట మండ్లి గ్రామానికి చెందిన మారుతికి ఇచ్చి వివాహం చేశారు. కొన్నాళ్లపాటు వీరి కాపురం అన్యోన్యంగా సాగింది. తర్వాత సంతానం కలుగలేదని కుటుంబంలో గొడవలు ప్రారంభమయ్యాయి. ప్రశాంతి తల్లిదండ్రులు అత్తింటివారికి నచ్చచెప్పి కూతురిని పలు ఆస్పత్రుల్లో చూపించారు. ఈ క్రమంలోనే అత్తమామల పోరు పడకలేక భర్తతో కలిసి ప్రశాంతి ఎనిమిదిరోజుల కిందట వేరు కాపురం పెట్టింది. ఇంతలో ఏం జరిగిందో ఏమో సోమవారం ఉదయం ప్రశాంతి ఇంట్లోనే ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తమ కుమార్తెను అత్తింటివారే వేధించి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించారని ప్రశాంతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీంను రప్పించి, శోధించారు. మృతురాలి భర్తను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని ప్రశాంతి మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎర్రదొడ్డి ఆలయ ఈవో అరెస్టు

5.573 కిలోల వెండి, 15 చీరలు, 1.980గ్రాముల బంగారం స్వాధీనం



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివనారాయణ స్వామి

కదిరి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయంలో చోరీకి పాల్పడిన ఈవో మురళీక్రిష్ణను పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 5.573 కేజీ వెండి ఆభరణాలు, 1.980గ్రా. బంగారం, 15 చీరలు స్వాధీనం చేసుకున్నట్లు కదిరి డీఎస్పీ శివనారాయణ స్వామి తెలిపారు. వాటి విలువ రూ.6.23 లక్షలు ఉంటుందన్నారు. పట్టణంలోని అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఈవో మురళీక్రిష్ణ ఈనెల 7న ఉదయం 11 గంటలకు అనుమతులు లేకుండా ఆలయంలోని ఆభరణాలు, చీరలు ఆటోలో తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆ మేరకు పోలీసులు ఆలయ ఈఓ నుంచి వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. విషయాన్ని దేవదాయ శాఖాధికారులకు తెలపగా, హిందూపురం దేవదాయ శాఖ తనిఖీ అధికారి ప్రసాద్ వచ్చి విచారణ చేసి, కదిరి రూరల్ యూపీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఈవో మురళీక్రిష్ణపై కేసు నమోదు చేశారు. ఈనెల 7వతేదీ రాత్రి 10 గంటలకు మురళీక్రిష్ణను సీఐ నిరంజన్‌రెడ్డి అరెస్టు చేశారు. రెండు ప్లాస్టిక్ సంచుల్లోని ఆభరణాలు, చీరలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈవో సెల్‌ఫోన్‌తోపాటు, బ్యాంకు ఖాతాల వివరాలు, ఇళ్లకూడా స్వాధీనం చేసుకోనున్నట్లు డీఎస్పీ చెప్పారు. చోరీ వ్యవహారంలో ఈఓతోపాటు వైసీపీ నాయకుడి హస్తం ఉందా.. అని విలేకరులు అడిగిన ప్రశ్నకు డీఎస్పీ సమాధానమిస్తూ.. లోత్తుగా విచారిస్తున్నామనీ, త్వరలో వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉందన్నారు. సమావేశంలో సీఐ నిరంజన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీలో ఆరుగురు డీబార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ 3,5 సెమిస్టర్ పరీక్షల్లో ఆరుగురు డీబార్ అయినట్లు ఎస్కేయూ పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య జీవీ రమణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నగరంలోని ఎస్ఎల్ఎన్ డిగ్రీ కళాశాలలో ఒకరు, ధర్మవరం వివేకానంద డిగ్రీ కళాశాలలో ఒకరు, గుత్తి ఎంఎస్ డిగ్రీ కళాశాలలో ముగ్గురు, హిందూపురంలోని బాలాజీ విద్యామందిర్‌లో ఒకరు చొప్పున మొత్తం ఆరుగురు కాపీయింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించి డీబార్ చేసినట్లు తెలిపారు.

టమోటా కిలో రూ.31

అనంతపురం రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో సోమవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.31తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదే విధంగా కనిష్ఠంగా రూ.14తో, సరసరిగా రూ.20తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1500 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

14న రగ్బీ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అస్మిత్ రగ్బీ మహిళా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 14న గుంటూరులోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు అస్మిత రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి కడపల శంకర్ తెలిపారు. అండర్-15 బాలికల కేటగిరీకి 2010-11 సంవత్సరంలో జన్మించి ఉండాలని, అండర్-18 బాలికల విభాగంలో 2007-08 సంవత్సరాల మధ్య, సీనియర్ మహిళల విభాగానికి 2000 నుంచి 2007 సంవత్సరాల మధ్య జన్మించిన క్రీడాకారిణులు అర్హులన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారిణులు ఈనెల 27, 28వతేదీలలో చెన్నైలో జరిగే సౌత్‌జోన్ నేషనల్ అస్మిత్ రగ్బీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు తమ పేర్ల నమోదు, మరిన్ని వివరాలకు పీడీ నాగరాజు సెల్ నంబరు 8341411083ను సంప్రదించాలని కోరారు.

పీజీ అడ్మిషన్లు వెలవెల

● 29 విభాగాల్లో 808 సీట్లు ఖాళీ
● తొలిరోజు 100 మంది హాజరు
● నేడు, రేపు కొనసాగనున్న ప్రక్రియ



విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పీజీ మిగులు సీట్లకు నిర్వహించిన స్పాట్ అడ్మిషన్లకు స్పందన అంతంత మాత్రమే కనిపించింది. తొలి రోజు సోమవారం ఉదయం 10 గంటలకు వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, అడ్మిషన్ల విభాగం డైరెక్టర్ నరసింహన్, వైస్ ప్రిన్సిపాల్ మునినారాయణప్ప ఆధ్వర్యంలో అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టారు. అనుకున్న స్థాయిలో విద్యార్థులు అడ్మిషన్లకు ఆసక్తి చూపలేదు. 29 విభాగాల్లో మొత్తం 808 ఖాళీలు ఉన్నట్లు అధికారులు చూపినప్పటికీ... 100 మంది మాత్రమే హాజరయ్యారు. ఇందులోనూ ఒక్కో విభాగానికి ఇద్దరేసి చొప్పున విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవడం గమనార్హం. ఏ విభాగంలో ఎంతమంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారోనన్న దానిపై స్పష్టత రాలేదు. అడ్మిషన్ల విభాగం డైరెక్టర్ నరసింహన్‌ను వివరణ కోరగా.. 100 మంది అడ్మిషన్లకు హాజరయ్యారని తెలిపారు. కొంత మంది ఫీజులు చెల్లించారని, తర్వాత చెల్లిస్తామని మరికొందరు చెప్పారని తెలిపారు.

ఒక్కో విభాగంలో ఒకరిద్దరే..

పీజీ మిగులు సీట్లకు నిర్వహించిన స్పాట్ అడ్మిషన్లలో ఒక్కో విభాగంలో ఒకరిద్దరు మాత్రమే అడ్మిషన్లు తీసుకున్నారు. మొత్తం 29 విభాగాల్లో 808 సీట్లు ఖాళీలు ఉన్నప్పటికీ విద్యార్థులు పెద్దగా ఆసక్తి కనబరచలేదు. ఏ విభాగంలో ఎంత మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారన్న సమాచారాన్ని అధికారులు వెల్లడించలేదు. సంబంధిత విభాగం నుంచి అందిన సమాచారం మేరకు...కొన్ని విభాగాల్లో అడ్మిషన్లను పరిశీలిస్తే... ఎమ్మెస్సీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగంలో 29 ఖాళీలు ఉండగా.. ముగ్గురు, ఎమ్మెస్సీ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రక్షన్స్ విభాగంలో 26 ఖాళీలుండగా... ఇద్దరు, జాగ్రఫీలో 20 సీట్లుండగా... ఒకరు, మేథమేటిక్స్‌లో 24 సీట్లు ఉండగా.. ఒకరు, పాలిమర్ సైన్స్ అండ్ టెక్నాలజీలో 17 సీట్లుండగా.. ఒకరు, సెరికల్చర్‌లో 11 సీట్లుండగా.. ఇద్దరు, జువాలజీలో 15 సీట్లుండగా ముగ్గురు హాజరైనట్లు సమాచారం. అదే విధంగా ఎంకామ్‌లో 42 సీట్లుండగా.. ఐదుగురు, ఎంపీఈడీలో 34 సీట్లుండగా... ఒకరు, ఎంఎల్‌ఐఎస్సీలో 30 సీట్లుండగా.. 9 మంది వచ్చినట్లు తెలుస్తోంది. ఎంఎస్‌డబ్ల్యూలో 32 సీట్లు ఉండగా... నలుగురు మాత్రమే అడ్మిషన్లు పొందారు. ఇక ఎమ్మెస్సీ అప్లైడ్ మేథమేటిక్స్‌లో 26 సీట్లు, మైక్రోబయాలజీలో రెండు సీట్లు, ఫిజిక్స్‌లో 42 సీట్లు, స్టాటిస్టిక్స్‌లో 14 సీట్లు, ఎంకామ్(ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్)లో 50 సీట్లుండగా ఒకక్కరంటే ఒక్కరు కూడా అడ్మిషన్లు పొందకపోవడం గమనార్హం. మిగిలిన విభాగాల్లోనూ ఆరేడు లోపు అడ్మిషన్లు జరిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే యూనివర్సిటీ అధికారులు అడ్మిషన్ల జాబితాను బయటపెట్టలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

నేడు, రేపు అడ్మిషన్లు..

మిగులు సీట్లకు సంబంధించి తొలి రోజు 100 మంది హాజరయ్యారు. అనుకున్న స్థాయిలో స్పందన లేకపోవడంతో అడ్మిషన్ల ప్రక్రియను మంగళ, బుధవారాల్లో కొనసాగిస్తున్నట్లు అడ్మిషన్ల విభాగం డైరెక్టర్ నరసింహన్ తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయండి: కలెక్టర్



ఎన్టీఆర్ వైద్యసేవ కార్డు అందజేస్తున్న కలెక్టర్, డీఎంహెచ్ఓ

అనంతపురం వైద్యం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పల్స్‌పోలియో కార్యక్రమాన్ని సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈబీ దేవి అధ్యక్షతన పల్స్ పోలియోపై కలెక్టర్ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 21న నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమానికి జిల్లాలోని 1785 పోలింగ్ బూత్‌లలో కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2,84,774 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయాలన్నారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేసేలా గ్రామాలు, పట్టణాలు, పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమీక్ష అనంతరం ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా 24 మంది అనాథపిల్లలకు హెల్త్‌కార్డులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రోగ నిరోధక విభాగ అధికారి డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి, వ్యాక్సినేషన్ మేనేజర్ రాజు, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఎన్టీఆర్ వైద్యసేవ డీసీ గంగాధర్‌రెడ్డి, విద్యుత్‌శాఖ ఎస్ఈ శేషాద్రి, ఎల్డీఎం నరేష్ రెడ్డి, డీపీఓ నాగరాజునాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్, హార్టికల్చర్ డీడీ ఉమాదేవి, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, టూరిజం జయకుమార్, పీఆర్ఎస్ సుబ్బరాయుడు, సివిల్ సప్లై డీఎం రమేష్‌రెడ్డి, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై వేటు

కొత్తచెరువు/మడకశిర రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు నరసింహమూర్తిని సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కిష్టప్ప సోమవారం ప్రకటనలో తెలిపారు. మడకశిర మండలం హరేసముద్రం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నరసింహమూర్తి విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని వారి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు క్షేత్రస్థాయిలో విచారణ చేయగా.. వాస్తవమేనని తేలడంతో నరసింహమూర్తిని సస్పెండ్ చేశామన్నారు. పోక్సో కేసు నమోదు చేసేలా ఫిర్యాదు చేయాలని మండల విద్యాశాఖాధికారికి సూచించామని డీఈఓ తెలిపారు.

శిక్షణకు కుష్బూ కొఠారి

అనంతపురం విద్య, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ శాఖ రెగ్యులర్ డీడీగా, ఎస్సీ సంక్షేమానికి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న కుష్బూ కొఠారి నాలుగురోజులపాటు నోయిడాలో శిక్షణకు ప్రభుత్వం తరఫున ఆదివారం రాత్రి వెళ్లారు. ఆ తర్వాత వారంపాటు వ్యక్తిగత పనిమీద సెలవుకు దరఖాస్తు చేసుకోగా.. కలెక్టర్ ఆనంద్ ఆమోదం తెలిపారు. దీంతో కుష్బూకొఠారి ఈనెల 21 వరకు విధులకు దూరంగా ఉంటారు. ఈనేపథ్యంలో మైనార్టీ సంక్షేమ శాఖ డీడీగా, బీసీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీగా కొనసాగుతున్న రామసుబ్బారెడ్డికి బీసీ సంక్షేమ శాఖ డీడీగా ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. ఎస్సీ సంక్షేమ ఇన్‌చార్జి బాధ్యతలను గిరిజన సంక్షేమ శాఖ డీడీ శ్రీనివాసరావుకు అప్పగిస్తూ సోమవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కుష్బూకొఠారి విధులకు హాజరయ్యేవరకు ఈ ఇద్దరు ఆయాశాఖల బాధ్యతలను చేపట్టనున్నారు.

ఎంపీడీఓలు కూడా..

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పలువురు ఎంపీడీఓలు సోమవారం శిక్షణకు వెళ్లారు. శ్రీకాళహస్తిలో వీరు ఐదు రోజులపాటు శిక్షణకు హాజరుకానున్నారు. ఆ మేరకు జిల్లా పరిషత్ ఇన్‌చార్జి సీఈఓ వెంకటసుబ్బయ్య ఉత్తర్వులు జారీ చేశారు. మండలాల్లో ఇబ్బందులు లేకుండా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి, శిక్షణకు ఎంపికైన ఎంపీడీఓలు వెంటనే రిలీవ్ అయి, వెళ్లాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. డిప్యూటీ ఎంపీడీఓలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి, ఎంపీడీఓలు రిలీవ్ అయి వెళ్లిపోయారు. నార్పల, గుత్తి, రాయదుర్గం, పెద్దపప్పూరు, కంబదూరు, బుక్కరాయసముద్రం, రొళ్ల, గుడిబండ, తాడిమర్రి ఎంపీడీఓలు మమతాదేవి, ప్రభాకర్, కొండన్న, రత్నాబాయి, సూర్యనారయణ, సాల్‌మాన్, నాగేశ్వర శాస్త్రి, కేశవరెడ్డి, వెంకటరంగారావు శిక్షణకు వెళ్లారు.

ఇద్దరు రైల్వే ఉద్యోగులకు అవార్డులు



కీమన్ వెంకోబాకు అవార్డు అందజేస్తున్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

గుంతకల్లు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించిన ఇద్దరు రైల్వే ఉద్యోగులకు డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా సోమవారం మ్యాన్ ఆఫ్ ది మంత్ అవార్డులను ప్రదానం చేశారు. రైల్ ట్రాక్‌కు వేసిన మట్టికట్ట దెబ్బతినడంతో కీ మ్యాన్ వెంకోబా ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. అలాగే ట్రాక్ పగుళ్లిచ్చిన విషయాన్ని కనిపెట్టిన ట్రాక్ మెయింటెనర్ బికాస్ కుమార్ సమాచారాన్ని అధికారులకు చేరవేశారు. వెంటనే రక్షణ చర్యలు చేపట్టి ప్రమాదాలు జరక్కుండా నివారించారు. విధి నిర్వహణలో చురుగ్గా వ్యవహరించిన ఈ ఇద్దరు ఉద్యోగులను సోమవారం డీఆర్ఎం తన కార్యాలయానికి పిలిపించి మ్యాన్ ఆఫ్ ది మంత్ అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చీనీకాయలు టన్ను రూ.18 వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.15వేలు పలికాయన్నారు.

తెరుచుకున్న పీఏబీఆర్ గేట్లు

కూడేరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్న హోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) గేట్లు మరోసారి తెరుచుకున్నాయి. సోమవారం సాయంత్రం మూడు గేట్లను ఎత్తి 620 క్యూసెక్కుల నీటిని మిడ్ పెన్నార్ డ్యాంకు వదిలారు. డ్యాంలో నీటి మట్టం 435.500 మీటర్ల వద్దకు చేరింది. 5.214 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రిజర్వాయర్‌కు 730 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తోంది. కుడికాలువకు 770 క్యూసెక్కులు వదులుతున్నారు. విద్యుదుత్పత్తికి 110 క్యూసెక్కులు వాడుతున్నారు. గేట్ల ద్వారా 620 క్యూసెక్కులు కలిపి మొత్తం 1,500 ఔట్ ఫ్లో వెళ్తోంది.

తెగిన కాలువను పరిశీలించిన ఎస్ఈ

● మరమ్మతులకు రూ.90 లక్షల అంచనా ● కుడికాలువ గేటు దించేందుకు యత్నం

కూడేరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని జల్లిపల్లి సమీపంలో 4.200 కిలోమీటర్ వద్ద తెగిన పీఏబీఆర్ కుడి కాలువ ప్రదేశాన్ని సోమవారం ఇరిగేషన్ శాఖ ఎస్ఈ సుధాకర్ రావు, డీఈ విశ్వనాథ్‌రెడ్డి, ఏఈ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. ఇటీవల కుడికాలువ అత్యవసర గేటును అతి కష్టం మీద పైకి ఎత్తారు. గేటుకు ఉన్న రబ్బర్లు తెరుచుకుని.. 750 క్యూసెక్కుల వరకు నీరు రావడంతోనే కాలువ తెగిపోయిందని తెలుస్తోంది. ప్రస్తుతం కుడికాలువ ద్వారా 550 నుంచి 600 క్యూసెక్కుల వరకు నీరు బయటకు వస్తుండడంతో మిడ్ పెన్నార్ డ్యాంకు మళ్లించారు. తెగిన కాలువకు తక్షణం ఇసుక బస్తాలు ఏర్పాటు చేసి నీటి వృధాను అరికట్టాలని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశించడంతో ఇరిగేషన్ అధికారులు రంగంలోకి దిగారు. రూ.90 లక్షల వ్యయంతో కాంక్రీట్ పనులు చేయాల్సి వస్తుందని అంచనాలు సిద్ధం చేస్తున్నారు. ఇదే విషయాన్ని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఎస్ఈ సుధాకర్‌రావు సమాచారం పంపినట్లు తెలిసింది. అంచనాలు సిద్ధం చేస్తున్నామని, నిధులు విడుదలయిన వెంటనే పనులు ప్రారంభిస్తామని డీఈ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. వారం రోజుల్లో పనులు పూర్తి చేసి యథావిధిగా కాలువకు నీటిని సరఫరా చేస్తామని వివరించారు.

● రెండు రోజుల్లో కుడికాలువ గేటు బంద్

జల్లిపల్లి గ్రామ సమీపంలో కాలువ తెగిపోవడంతో డ్యాం నుంచి వస్తున్న నీటిని మిడ్ పెన్నార్ డ్యాంలోకి మళ్లించారు. కుడికాలువ పనులు పూర్తి కావడానికి వారం రోజులకు పైగా పట్టే అవకాశం ఉండటంతో గేట్లను బంద్ చేయడానికి అధికారులు సిద్ధమయ్యారు. గతంలో హొస్పేట్‌కు చెందిన ఆనంద్‌రాజ్, కర్నూలుకు చెందిన శ్రీనివాసులు బృందం సంయుక్త కార్యాచరణతో కుడికాలువ గేట్లు పైకి లేపారు. ప్రస్తుతం కుడికాలువ తెగిపోవడంతో తిరిగి గేటు కిందికి దించేందుకు ఆ రెండు బృందాలకు ఇరిగేషన్ అధికారులు సమాచారం పంపారు. శ్రీనివాసులు బృందం సభ్యులు గేట్లు దించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండ్రోజుల్లో గేటు కిందికి దించే ప్రక్రియ ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు. ఇస్మాయిల్, సిబ్బంది పాల్గొన్నారు.



తెగిన కాలువ గట్టును పరిశీలిస్తున్న ఎస్ఈ సుధాకర్‌రావు



ఏఎంసీ మెప్మా కార్యాలయంలో కిక్కిరిసిన దరఖాస్తుదారులు

స్మార్ట్ స్ట్రీట్ మార్కెట్‌కు డిమాండ్

● 3వేలకు పైగా దరఖాస్తులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ స్ట్రీట్ మార్కెట్ ఏర్పాటుకు డిమాండ్ పెరిగింది. నగరపాలక సంస్థ మెప్మా ఆధ్వర్యంలో త్వరలో బళ్లారి రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ ప్రారంభించనున్నారు. వీధి వ్యాపారుల జీవనోపాధి కోసం వీధి విక్రయదారులు, స్వయం సహాయక సంఘాల సభ్యుల నుంచి దరఖాస్తులు కోరారు. స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌లో వంద షాపులను ప్రారంభించనున్నారు. వంద షాపులకు గాను మూడు వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఒకే ప్రదేశంలో అన్ని రకాల వస్తువులు అందుబాటులోకి తీసుకువచ్చే ఒరవడికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పెద్ద నగరాలకే పరిమితమైన స్మార్ట్ స్ట్రీట్ మా ర్కెట్‌ను నగరవాసులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇప్పటి వరకు మూడువేల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారని నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి తెలిపారు.

విపత్తులను ఎదుర్కొంటాం: డీజీ



మాట్లాడుతున్న డీజీ పీవీ రమణ

పెనుకొండ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి విపత్తులనయినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీ) పీవీ రమణ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 52 మంది గజ ఈతగాళ్లకు సోమవారం పెనుకొండలో నిర్వహిస్తున్న మూడురోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీ మీడియాతో మాట్లాడుతూ.. 26 జిల్లాల నుంచి అగ్నిమాపకశాఖకు సంబంధించిన నైపుణ్యం కలిగిన 52 మందిని గుర్తించామని తెలిపారు. వీరికి మూడు రోజులపాటు ఈ ప్రాంతంలో శిక్షణ ఇచ్చిన అనంతరం ఆయా జిల్లా అగ్నిమాపక కేంద్రాల్లో తిరిగి శిక్షణ ఇస్తారని అన్నారు. శిక్షణ పూర్తిచేసిన 52 మందిలో తిరిగి 26 మందిని ఎంపిక చేసి విజయవాడలో కఠిన శిక్షణ ఇస్తామని తెలిపారు. 2026 జూన్‌కు ప్రతి జిల్లాకు రెస్క్యూ టీంను సిద్ధం చేస్తామని వివరించారు. కార్యక్రమంలో రీజినల్ ఫైర్ ఆఫీసర్ గోపాల్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మాధవనాయుడు పాల్గొన్నారు.

కియకు పటిష్ట భద్రత: ఆక్టోపస్ డీఎస్పీ



భద్రతా దళాలతో స్థానిక పోలీసులు

పెనుకొండ రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కియ సంస్థలోకి చొరబాటుదారులు రాకుండా అడ్డుకునేందుకు పటిష్టమైన భద్రత చర్యలు తీసుకున్నట్లు ఆక్టోపస్ డీఎస్పీ జగ్గనాయుడు తెలిపారు. ఆక్టోపస్ ఆధ్వర్యంలో కియ సంస్థలో 'ఆపరేషన్ ఫాల్కన్' పేరిట సోమవారం మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. సంస్థ సెక్యూరిటీ, సిబ్బందికి రక్షణ కల్పిస్తూ భద్రత దళాలు మాక్ డ్రిల్‌ను నిర్వహించాయి. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చొరబాటుదారులను న్యూట్రలైజ్‌చేసి వారి చేతిలో బందీలుగా ఉన్నవారిని సురక్షితంగా రక్షించే చర్యలపై అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కియ సీఎస్ఓ మధుసూదన్, సెక్యూరిటీ ఇన్‌చార్జ్ నవీన్‌చంద్, వెంకటేష్, పార్థసారథి, ఎస్ఐలు రాజేష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రెజ్లింగ్‌లో అంతర్జాతీయ పతకం

● సత్తాచాటిన కొత్తచెరువు వాసి చంద్రప్రియ



కోచ్‌లతో కలిసి పతకాన్ని చూపుతున్న చంద్రప్రియ

కొత్తచెరువు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లా కొత్తచెరువుకు చెందిన అప్పన్నగారి చంద్రప్రియ అంతర్జాతీయ పతకాన్ని సా ధించి సత్తాచాటారు. ఈనెల 6,7 తేదీలలో బ్యాంకాక్‌లో జరిగిన అంతర్జాతీయ ఏషియన్‌స్థాయి గ్రాఫ్ లింగ్ రెజ్లింగ్ పోటీలలో పాల్గొని బ్రాంచ్ మెడల్ సాధించినట్టు రెజ్లింగ్ గ్రాఫ్ లింగ్ కార్యదర్శి సాయిలీల, కోచ్ మురళీకృష్ణ తెలిపారు. హిందూపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ, అయోధ్యలో జరిగిన జాతీయ స్థాయిలో పోటీల్లోనూ సత్తాచాటి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయింది. ఈనెల 6న భారతదేశం జట్టు తరఫున చంద్రప్రియ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని బ్రాంచ్ మెడల్ కైవసం చేసుకుందని కోచ్‌లు తెలిపారు. చంద్రప్రియ మెడల్ సాధించడతో భారతీయ రెజ్లింగ్ గ్రాఫ్‌లింగ్ అసోసియేషన్, ఒలింపిక్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. చంద్రప్రియ సాధారణ కుటుంబంలో జన్మించి అంచలంచెలుగా ఎదుగుతూ అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిందని పలువురు ప్రశంసిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో మెడల్ సాధించడంతో చంద్రప్రియను కొత్తచెరువులో పలువురు అభినందించారు.

12న గొర్రెల సహకార సంఘాలకు ఎన్నికలు

అనంతపురం అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఈనెల 12వతేదీ రెండో విడతలో 29 ప్రాథమిక గొర్రెల సహకార సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. అనంతలో 20, సత్యసాయిలో 9 సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన స్థానిక వెటర్నరీ డాక్టర్లను ఎన్నికల అధికారులుగా నియమించారు.

న్యూస్ బాక్స్

శివాలయంలో సంకష్ట హర చతుర్థి


వినాయకుడికి పూజలు చేస్తున్న అర్చకుడు

కదిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయంలో సోమవారం రాత్రి గణపతి విగ్రహానికి పంచామృతాభిషేక సేవ చేశారు. అలాగే గరికపూజ, సంకట హర చతుర్థి వ్రతకథ తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సంకష్ఠ హర చతుర్థి సందర్భంగా భక్తులు అధికంగా పాల్గొన్నారు. ఆలయకమిటీ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విభిన్న ప్రతిభావంతుల ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న విభిన్న ప్రతిభావంతులు

ఓబుళదేవరచెరువు, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా సోమవారం విభిన్న ప్రతిభావంతులు మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఐటీఐ నుంచి ప్రధాన వీధుల గుండా అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో ఎస్‌టీఎల్ రవికుమార్, నాగరాజు, గీతా, ఈశ్వరయ్య, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలకు విరాళం

ధర్మవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎంఎల్‌టీ విభాగానికి పట్టణానికి చెందిన పట్టుచీరల వ్యాపారి దాసరి హరి రూ. 15 వేలు విరాళం అందజేశారు. ఆయన సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ వనితావాణికి అందజేశారు. అధ్యాపకులు పెద్దన్న, ప్రభాకర్, మల్లికార్జున తదితరులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

అయ్యప్ప మాలధారుల భిక్షకు...

కొత్తచెరువు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పీవీ జయప్రకాశ్, ఆయన సతీమణి పీవీ లీలావతి సోమవారం అయ్యప్ప మాలధారుల భిక్ష కోసం రూ. 25 వేలను విరాళం ఇచ్చారు. వారి కుమారులు నరేంద్రబాబు, సురేంద్రబాబు సమకూర్చిన సొమ్మును స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో గురుస్వాములు పెద్దన్న, వెంకటేశ్‌కు వారు అందజేశారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

బత్తలపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన ఎన్‌ఆర్ఐ చిందులూరి బాబుప్రసాద్ దంపతులు సోమవారం ఆ గ్రామ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఉపాధ్యాయురాలు అంజన, టీడీపీ నాయకులు మోహన, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి వాటర్ ఫిల్టర్ల వితరణ

తనకల్లు, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని తవళం ఆంజనేయస్వామి ఆలయంలోని సీతారామాంజనేయస్వామి మందిరానికి వాటర్ ఫిల్టర్లను ఇచ్చారు. నాయనచెరువుపల్లికి చెందిన సూర్యనాయక్ కుటుంబ సభ్యులు రెండు వాటర్ ఫిల్టర్లను సోమవారం ఆలయ చైర్మన్ ఈశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ చెన్నక్రిష్ణకు అందజేశారు.

క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ధర్మవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల మైదానంలో క్రికెట్ బెట్టింగ్ ఆడిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసినట్టు డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. ఈ నెల ఒకటో తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'మూడు ఓవర్లు..రూ.లక్షల్లో బెట్టింగులు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. క్రికెట్ బెట్టింగ్ ఆడిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని డీఎస్పీ తెలిపారు. ఇంకా క్రికెట్ బెట్టింగ్‌లో ఎవరైనా ఉన్నారా అన్న కోణంలో విచారిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఎవరైనా క్రికెట్‌బెట్టింగ్ ఆడించినా చట్ట రీత్యా నేరమని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.సబ్ డివిజన్ పరిధిలో ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నట్టు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని డీఎస్పీ తెలిపారు.

ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు

ధర్మవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే క్వార్టర్స్‌లో ఉన్న ఐపీసీ చర్చిలో సోమవారం ధర్మవరం యునైటెడ్ పాస్టర్స్ వెల్ఫేర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో యునైటెడ్ పాస్టర్స్ ఫ్యామిలీ ప్రీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ సొసైటీ ధర్మవరం అధ్యక్షుడు షేక్ మోజేష్, కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి పి. జెనల్మాన్, కోశాధికారి ఎం. గ్రేసయ్యతో పాటు కమిటీలోని ఇతర సభ్యులు, అన్ని సంఘాల నాయకులు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా నెల్లూరు నుంచి పాస్టర్ సంతోష్ హాజరై దేవుడి సందేశాన్ని వినిపించారు. అనంతరం సీనియర్ పాస్టర్ శామ్యూల్, ఆయన సతీమణి ప్రభుకుమారిని వారు సన్మానించి మెమెంటో అందజేశారు.

కిందపడి బేల్దారికి తీవ్రగాయాలు

ధర్మవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని పార్థసారధి నగర్‌కు చెందిన గోవిందు అనే బేల్దారి నూతన ఇంటి నిర్మాణం పనులు చేస్తున్న సమయంలో పొరపాటున కాలు జారి కిందకుపడి తీవ్రంగా గాయపడ్డాడు. పార్థసారథినగర్‌కు చెందిన గోవిందు శారదనగర్‌లో సోమవారం ఓ ఇంటి నిర్మాణం పనులు చేస్తున్నాడు. ప్రమాద శాత్తు పైనుంచి కిందకు జారిపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తోటి భవన నిర్మాణ కార్మికులు గమనించి అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం అనంతపురానికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

టీడీపీ నాయకుడికి మాజీ మంత్రి పరామర్శ


అన్నం లక్ష్మీనారాయణను పరామర్శిస్తున్న పల్లె రఘునాథ్‌రెడ్డి

నల్లమాడ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఎర్రవంకపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, సింగల్‌విండో మాజీ అధ్యక్షుడు అన్నం లక్ష్మీనారాయణ అనారోగ్యంతో బాధపడుతున్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి సోమవారం అన్నం లక్ష్మీ నారాయణ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అన్నం లక్ష్మీనారాయణ పార్టీ బలోపేతానికి ఎన్నలేని కృషి చేశార న్నారు. మాజీ మంత్రితోపాటు లాయర్ వీరనారాయణ, లక్ష్మణ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న మొక్కలు

● 15 రోజులు కూడా కాకనే సంరక్షణ వదిలేసిన అధికారులు


చిత్రావతి నది ఒడ్డున నీరు లేక ఎండిపోయిన పూలమొక్కలు

పుట్టపర్తి రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్రప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి చిత్రావతి సుందరీకరణ పనులు చేపట్టింది. ఇందులో భాగంగా కర్ణాటకనాగేపల్లి సత్యసాయి పార్క్ నుంచి దుర్గాదేవి ఆలయం వరకు దాతల సహకారంతో పూలమొక్కలను నాటారు. మొక్కలైతే నాటారు కాని వాటికి నీరు పోయడం మరిచిపోయారు. దీంతో ఆ మొక్కలు కాస్తా ఎండిపోతున్నాయి. పట్టుమని 15 రోజులు కూడా కాకనే అధికారులు మొక్కలను సంరక్షణను వదిలేయడం దారుణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొక్కలే కదా అని వదిలేశారని ఎద్దేవ చేస్తున్నారు. పక్కనే చిత్రావతి నది నిండుగా నీరు ఉన్నా గట్టు మీద ఉన్న మొక్కలకు నీరుపో యకపోవడంతో సంబంధిత అధికారుల నిర్లక్ష్యం తేటతెల్లమవుతోందని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా దాతలు ఎంతో ఔదార్యంతో సహకరించి చిత్రావతి నది ఒడ్డున నాటిన మొక్కలను సంరక్షించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

బాధ్యతగా పనిచేయాలి: జీసీడీఓ

● కేజీబీవీ తనిఖీ


వసతిగృహ సిబ్బందిని విచారిస్తున్న జీసీడీఓ అనిత

గాండ్లపెంట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విధులను బాధ్యతగా నిర్వర్తించాలని ట్రైబల్ ఫోర్ కస్తూర్బా పాఠశాల(కేజీ బీవీ) సిబ్బందికి జీసీడీఓ అనిత సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల వసతి గృహంలో విద్యార్థినులతో వంట పనులు, కూరగాయలు కోయడం, వాటర్ క్యాన్‌లు మోయించడం వంటి పనులు చేయిస్తున్నారని, సోషల్ మీడియాలో వీడియోలు చక్కర్లు కొడుతున్నాయని జీసీడీఓ అన్నారు. ఈ సందర్భంగా వసతి గృహం తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. వసతి గృహంలోని విద్యార్థినులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అలాగే వసతిగృహంలో విద్యార్థినులచే పనులు చేయిస్తున్నట్లు వైరల్ అవుతున్న దృశ్యాలపై విద్యార్థినులచే ఆరా తీశారు. హాస్టల్ ప్రారంభంలో సిబ్బంది లేకపోవడంతో సహాయం చేశామని విద్యార్థినులు తెలిపారు. ప్రస్తుతం ఎవరూ తమతో పనులు చేయించడంలేదని జీసీడీఓకు వివరించారు. అనంతరం మెనూ ప్రకారం భోజనాలపై ఆరా తీశారు. హాస్టల్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ప్రభుత్వం ఎవరికి కేటాయించిన పనులు వారే చేయాలని, విద్యార్థినులతో చేయించరాదని గట్టిగా హెచ్చరించారు. తీరు మారకపోతే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు కృష్ణా నాయక్, శ్రీనివాసులు, హెచ్ఎం ప్రసాద్, హాస్టల్ వార్డెన్ జ్యోత్స్న పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య విలువలను కాపాడిన వాజ్‌పేయి

● బీజేపీ నాయకులు ● 11న విగ్రహావిష్కరణ

ధర్మవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించారని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు తెలిపారు. స్థానిక ఎన్డీఏ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా ధర్మవరంలో ఆయన కాంస్య విగ్రహావిష్కరణను కాలేజ్ సర్కిల్‌లో ఈనెల 11న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు సాగుతున్నాయన్నారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కేంద్రమంత్రి శ్రీనివాస్‌శర్మ, రాష్ట్రంలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, బీజేపీ రాష్ట్ర ప్రతినిధులు 10వతేదీ సాయంత్రమే ధర్మవరం చేరుకుంటారన్నారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం 2,087మందికి ఉచితంగా సైకిళ్లను మధ్యప్రదేశ్ సీఎం చేతులమీదుగా పంపిణీచేయనున్నట్టు తెలిపారు. ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబుళేశు, పట్టణ, రూరల్ అధ్యక్షులు జింకా చంద్ర, గొట్లూరు చంద్ర, నాయకులు చిన్న లింగమయ్య, భాస్కర్, రామ్మోహన్, నబీరసూల్ పాల్గొన్నారు.

బీజేపీలోకి పలువురి చేరిక


బీజేపీలోకి చేరిన వారితో హరీశ్‌బాబు

ధర్మవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 38వ వార్డుకు చెందిన పలువురు సోమవారం బీజేపీలోకి చేరారు. 38వ వార్డుకు చెందిన టిప్పుసుల్తాన్, మిత్రబృందం ఎన్డీఏ స్థానిక కార్యాలయంలో బీజేపీ నాయకుడు జమీర్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. వారికి ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం హరీశ్‌బాబు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వం, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ సేవాధోరణితో ప్రేరణ పొం ది వారు పార్టీలోకి చేరారని అన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్య దర్శి సాకే ఓబుళేశు, పట్టణ, రూరల్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ మండల కమిటీ ఎంపిక


నూతన కమిటీ

తనకల్లు, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ మండల నూతన కమిటీని సోమవారం కదిరిలో ఎంపిక చేసినట్లు ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీప్రసాద్ తెలిపారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా జాఫర్‌హుస్సేన్, అదనపు ప్రధాన కార్యదర్శిగా రమేష్‌నాయక్, జిల్లా కార్యదర్శిగా ఎంవీఎన్ ప్రసాద్, జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులుగా రవికుమార్ ఎన్నుకున్నట్లు తెలిపారు. అలాగే తనకల్లు మండల గౌరవాధ్యక్షుడిగా మోహన్, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌నాయుడు, అదనపు ప్రధాన కార్యదర్శిగా శివకుమార్, పీటీఎఫ్ కన్వీనర్‌గా పురుషోత్తమరెడ్డి, ఎంటీఎస్ కన్వీనర్‌గా శంకర్, ఐటీ కన్వీనర్‌గా మహేష్, మహిళా కన్వీనర్‌గా నీరజ, కార్యదర్శులుగా సురేష్‌నాయక్, హరినాయక్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

నల్లమాడ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఏఓ అబ్దుల్‌హక్ సోమవారం తనిఖీ చేశారు. నల్లమాడలోని మూడు ఎరువులు దుకాణాలను తనిఖీ చేశామన్నారు. ఎరువుల శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపుతున్నామని తెలిపారు. రికార్డులు, రిజిస్టరు, స్టాక్ బోర్డులను, స్టాక్‌ను పరిశీలించారు.

గ్రామ సచివాలయాల తనిఖీ

కదిరి అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరవాండ్లపల్లి గ్రామ సచివాలయం-2ను ఎంపీడీవో పోలప్ప సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వ పథకాల జాబితాల ప్రదర్శన, రికార్డులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. సిబ్బంది సర్వేలు పూర్తి చేయడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సర్వేయర్లు అటెండెన్స్‌లో సంతకాలు చేయకపోవడంతో వెంటనే వారికి మెమో జారీ చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించమని హెచ్చరించారు.

● నల్లచెరువు: మండల పరిధిలోని పి.కొత్తపల్లి సచివాలయాన్ని ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి తనిఖీ చేశారు. సచివాలయంలోని పలు రికార్డులను, ఉద్యోగుల హాజరుపట్టికను పరిశీలించారు. సచివాలయంలోని అన్ని వసతులపై ఆరాతీశారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ గ్రామప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ మసిఉల్లా, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, వీఆర్ఓ జ్యోతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరింపజేయాలి : డీపీఎం


పొలంలో ఐసీఆర్‌పీలకు శిక్షణ ఇస్తున్న డీపీఎం లక్ష్మానాయక్

బత్తలపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరింపజేయలని డీపీఎం లక్ష్మానాయక్ ఐసిఆర్‌పీలకు సూచించారు. కొత్తగా ఎంపికైన ట్రైనీ ఐసీఆర్‌పీలకు మండలపరిధిలోని గంటాపురం గ్రామంలో సోమవారం ప్రకృతి వ్యవసాయం లో శిక్షణ ఇచ్చారు. డీపీఎం ఉదయం 6గంటలకే ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పొలాలకు వెళ్లి ట్రైనీ ఐసీఆర్‌పీలకు ప్రకృతి వ్యవసాయంలో సాగు విధానంపై వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో పాటించవలసిన ఆరు సార్వత్రిక సూత్రాలను తెలియజేశారు. ప్రోగ్రాం మేనేజర్ నరేంద్ర, ఎంటీ హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు దుస్తుల పంపిణీ

కొత్తచెరువు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక నాగిరెడ్డిపల్లి క్వార్టర్స్ సమీపంలో గుడిసెలు వేసుకుని పేదలు జీవిస్తున్నారు. లండన్‌కు చెందిన సత్యసాయి భక్తులు చంద్రసోదా, అనిల్‌సోదా, గంట్రాకుమార్, యాస్‌లు సోమవారం రూ. 2లక్షలు విలువ చేసే దుస్తులు, కుక్కర్లు అక్కడ జీవనం సాగిస్తున్న దాదాపు 400 మంది మహిళలకు అందజేశారు. బాబా సూచించిన మానవసేవే మాధవ సేవ అన్ననినాదంతో పేదలకు అందించామని తెలిపారు. విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సాయి భక్తులు సాయిరామిరెడ్డి, కేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలో సైన్స్ ఫెయిర్



విద్యార్థులు తయారు చేసిన సైన్సు నమూనాలు

నల్లమాడ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శ్రీబాలాజీ ఉన్నత పాఠశాలలో సోమవారం సైన్సు ఫెయిర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ సురేష్‌బాబు హాజరై, కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన సైన్సు పరికరాలను, నమూనాలను ఆయన పరిశీలించారు. ప్రతిభ కనబరిని విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఎంఈఓ సురేష్‌బాబును కరస్పాండెంట్ కళావతి, ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు సన్మానించారు.

చుక్కల భూముల సమస్యను పరిష్కరించండి

● సీపీఐ నాయకుల డిమాండ్
● తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేసి నిరసన


బస్టాండ్ కూడలిలో రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు

ముదిగుబ్బ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న చుక్కల భూముల సమస్యతో పాటు ఫ్రీహోల్డ్ భూముల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతులు సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద నుంచి ర్యాలీగా వెళ్లి, జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి, తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఇన్‌చార్జ్ తహసీల్దార్ మునిస్వామికి అందజేశారు. ఈ మేరకు సీపీఐ నాయకులు ఎమ్మార్వో కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ... 1954 ముందున్న పాత పట్టా భూములు చాలా వరకు 2018 నుంచి 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడంతో, చుక్కల భూములుగా నమోదై నేటికీ రిజిస్ట్రేషన్‌కు నోచుకోకుండా పోయాయన్నారు. ఈ కార్యక్రమంలో తిప్పయ్య, ఈశ్వర్ నాయక్, రమేష్ నాయు డు, వెంకట్‌రాముడు, కుర్ర నాయుడు, లింగుట్ల రామకృష్ణ, వెంకటేశ్వర నాయక్, శంకర, ఎం మధు, వెంకటేష్, కొండయ్య, మంగలి శీనా, చాంప్లా నాయక్, సన్నా భాయ్, సరస్వతి భాయ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలుపుతున్న దృశ్యం

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికి చెందిన 44 మందికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సోమవారం పంపిణీ చేశారు. పట్టణంలోని రోడ్లు భవనాల అతిథి గృహంలో ఆయన సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ. 31,05,742,00 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

13న హిందూ సమ్మేళనం

కదిరి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈ నెల 13వ తేదీన హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు శ్రీఖాద్రీ లక్ష్మీనృసింహ సేవా సమితి నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు బాలికల జూనియర్ కళాశాల ఆవరణంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. హిందువులందరూ హాజరుకావాలని కోరారు.

రోడ్డు సమస్య పరిష్కరిస్తాం: తహసీల్దార్


అధ్వానంగా ఉన్న రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

నంబులపూలకుంట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని తూర్పునడింపల్లిలో రోడ్డు సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ దేవేంద్రనాయక్ పేర్కొన్నారు. ఆయన సోమవారం గ్రామంలో పర్యటించారు. టీఎన్ కొత్తపల్లికి వెళ్లే ఈ రోడ్డులో గత కొన్ని సంవత్సరాలుగా వర్షం నీరు, మురుగునీరు నిలువ ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. చాలా సంవత్సరాలుగా రోడ్డు సమస్య ఉందన్నారు. గ్రామానికి చెందిన నాయకులు గ్రామంలోని సమస్యలను ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు తీసుకెళ్లారు ఎమ్మెల్యే ఆదేశించడంతో సోమవారం అధికారులు గ్రామానికి వచ్చి పరిశీలించినట్లు తెలిపారు. ఇళ్ల, భూముల యజమానులతో మాట్లాడి ఈ రోడ్డులో నీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గ్రామస్థులకు తెలిపారు. ఆయనతోపాటు ఎంపీడీఓ పార్థసారథి, డిప్యూటీ ఎంపీడీఓ మాధవరెడ్డి, ఎస్ఐ వలీబాషా, ఎంపీటీసీ పౌల్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్లకు మరమ్మతులు

నంబులపూలకుంట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కదిరి-గాండ్లపెంట రహదారిపై రెక్కమాను, ద్వారనాల, తాళ్ల కాలువ, ధనియాన్‌చెరువు గ్రామాల వద్ద ఉన్న సిమెంటు రోడ్ల మరమ్మతు పనులను సోమవారం ప్రారంభించినట్లు కాంట్రాక్టర్ గాలివీటి క్రిష్ణమోహన్‌నాయుడు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ కదిరినుంచి రాయచోటికి తార్‌రోడ్డుకు ఉన్న ప్పటికీ, ఆ రోడ్డుకు సంబంధించి గ్రామాల్లో ఉన్న సీసీరోడ్లు గుంతలమయంగా మారాయని, ఈవిషయా న్ని గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారన్నారు. స్పందించిన ఎమ్మెల్యే రూ.2.7కోట్లు నిధులను సిమెంటు రోడ్ల మరమ్మతులకు కేటాయించినట్లు తెలిపారు. దీంతో ఆయా గ్రామాల్లో పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే కదిరి, రాయచోటి తార్ రోడ్డు పనులు పూర్తి చేశామన్నారు.

వీఆర్ఓలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

తాడిమర్రి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తమ స్థలాన్ని ఇతరుల పేరుమీద ఆన్‌లైన్‌లోకి ఎక్కించారంటూ భీమరాయునిపేట గ్రామస్థులు వీఆర్‌ఓలపై సోమవారం ఫిర్యాదుచేశారు. భీమరాయునిపేటకు చెందిన రామాంజినేయులు, చంద్రశేఖర్, మరో 30 మంది సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. గ్రామంలోని సర్వే నం. 416లో 12 సెంట్ల స్థలాన్ని గ్రామానికి చెందిన మరొకరికి రెవెన్యూ అధికారులు పట్టా ఇచ్చారంటూ తహసీల్దార్‌కు ఫిర్యాదుచేశారు. వీఆర్‌ఓ లను అడిగితే ఒకరిపైఒకరు చెప్పుకుంటున్నారని ఫిర్యాదుచేశారు. స్పందించిన తహసీల్దార్ రికార్డులను పరిశీలించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

పది విద్యార్థులకు మోడల్ పేపర్ల పంపిణీ


కదిరి కేజీబీవీలో విద్యార్థినులకు మోడల్ పేపర్లు పంపిణీ చేస్తున్న ఆర్డీవో

కదిరి అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ రూపొందించిన మోడల్ పేపర్లను మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు సోమవారం పంపిణీ చేసినట్లు హార్ట్ టూ హెల్ప్ ట్రస్టు అధ్యక్షుడు మూడే రవి నాయక్ తెలిపారు. దాతలు శ్రీనివాస నాయక్, బ్రహ్మానంద రెడ్డి సహకారంతో 250 మంది విద్యార్థులకు రూ. 20,000 విలువగల మోడల్ పేపర్ పుస్తకాలను ఆర్డీఓ వీవీఎస్ శర్మ చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆర్డీఓ సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు చెన్నకృష్ణ, ఓబులరెడ్డి, యూటీఎఫ్ నాయకులు శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు శంకర్, స్వరూప, సుభానుల్లా, భాస్కర్, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● అమడగూరు: యూటీఎఫ్ తయారుచేసిన పదో తరగతి మోడల్ టెస్ట్ పేపర్ల పుస్తకాలను మండల పరిధిలోని చినగానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పంపిణీ చేశారు. వాటిని సోమవారం కదిరి సిమ్స్ హాస్పిటల్ ఎండీ నిసార్ యాషిన్ ఖాన్ ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు రవిరాజ్, యూటీఎఫ్ నాయకులు ఖాజాపీర్, ఉమాపతి, ఉపాధ్యాయులు సునీత, హేమలత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో

ధర్మవరం జట్టుకు ద్వితీయ స్థానం


రాష్ట్రస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థినులు

ధర్మవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ బీఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈనెల 6,7 తేదీలలో నరసరావుపేటలోని కేశానిపల్లిలో జరిగిన ఫ్లోర్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి ద్వితీయస్థానం సాధించినట్టు పాఠశాల హెచ్ఎం జ్యోతిలక్ష్మి, పీఈటీ లక్ష్మీనారాయణ తెలిపారు. పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినులు కీర్తి, పావని, సహస్రరెడ్డి, ఈశ్వరి, ఎనిమిదో తరగతి చదువుతున్న హేమశ్రీ, అంజుమ్, రోహిణి, పదో తరగతి చదువుతున్న ఉష్మశ్రీ, శ్రీదేవి రాష్ట్రస్థాయి పోటీలలో సత్తాచాటి రజత పతకం కైవసం చేసుకున్నారని వారు తెలిపారు. ఆ విద్యార్థినులు జిల్లా, రాష్ట్రానికి పేరుప్రతిష్ఠలు తీసుకురావడం గర్వించదగ్గ విషయమన్నారు.

న్యూస్ బాక్స్

పట్టణాభివృద్ధే లక్ష్యం: చైర్మన్ రమేష్


రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రమేష్

హిందూపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పురం పట్టణ అభివృద్ధి చేయడమే లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. సోమవారం పట్టణంలోని ముక్కడిపేట, లింకంపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే పీఏ వీరయ్యతో కలిసి చైర్మన్ మాట్లాడుతూ వచ్చే ఏడాదిలోపు పట్టణంలోని అన్ని రహదారులు సీసీ రోడ్లు అవుతాయన్నారు. శివారు ప్రాంతాల్లో సైతం రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేస్తామన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు అనిల్‌కుమార్, షఫి, నెట్టప్ప, అమరనాథ్, మస్తాక్, అంజాద్, నవీన్ పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు తరలిరండి


మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

గోరంట్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ధర్మవరం పట్టణంలో 11వ తేదీన మాజీ ప్రధాని వాజ్‌పేయి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి కూటమి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని బీజేపీ మండల కన్వీనర్ బోయ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. గోరంట్లలోని పార్టీ కార్యాలయంలో సోమవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ ఆధ్వర్యంలో వాజ్‌పేయి విగ్రహావిష్కరణ ధర్మవరంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

విజ్ఞాన యాత్రకు విద్యార్థులు


లేపాక్షి ఆలయంలో విద్యార్థులు

పెనుకొండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం ప్రధానోపాధ్యాయుడు రాఘవయ్య ఆధ్వర్యంలో విజ్ఞాన యాత్రకు బయలుదేరి వెళ్లారు. వీరు లేపాక్షి, చిలమత్తూరులోని వీరాపురాన్ని సందర్శించారు. వీరాపురంలో సైబీరియన్ పక్షులను తిలకించారు. లేపాక్షిలో శిల్పకళా వైభవం రాజుల కాలంలో వాడిన సాంకేతిక నైపుణ్యం గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు.

పాఠశాలకు బల్ల వితరణ


ఉపాధ్యాయులకు బల్లను అందజేస్తున్న రియాజ్‌బాషా

పెనుకొండ రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంకటరెడ్డి ప్రాథమికోతన్న పాఠశాలకు దాతలు బల్లను వితరణచేశారు. సోమవారం ప్రధానోపాధ్యాయుడు నారాయణ స్వామికి బల్లను ఏపీ ముస్లిం ఐక్యవేదిక సభ్యులు రియాజ్ బాషా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరిజమ్మ, భారతి, కరుణకుమారి, రేష్మాభాను, ఆనందనమ్మ, నరేష్ కుమార్, బాబు, చంద్రశేఖర్, రవి పాల్గొన్నారు.

అడ్డంకులు తొలగాలని పూజలు


శివాలయం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న బాలకృష్ణ అభిమానులు

హిందూపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ-2 సినిమాకు అడ్డంకులు తొలగాలని హిందూపురంలో ఆయన అభిమానులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బసవనపల్లి వద్ద ఉన్న శివాలయంలో 101 టెంకాయలు కొట్టి పూజలు చేయించారు. ఎన్‌బీకే ఫ్యాన్స్ నాయకులు సతీష్, రాము, బాలాజీ మాట్లాడుతూ త్వరలోనే సినిమాకు అడ్డంకులు తొలగిపోయి సినిమా విడుదలవ్వాలని స్వామిని ప్రార్థించామన్నారు. ఉద్దేశ్యపూర్వకంగా బాలయ్యకు వస్తున్న క్రేజ్ చూసి కొందరు తట్టుకోలేకపోతున్నారన్నారు. టీడీపీ నాయకులు నారాయణస్వామి, ఆది, రాజు, మూర్తి, సూరి, అంజలి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


రన్నరప్ ట్రోఫీతో విద్యార్థులు

రొళ్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా డోన్‌లోని డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన ఏపీ టీ-10 టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీల్లో స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. అంతర్‌జిల్లా చాంపియన్‌షిప్-2025 సబ్‌జూనియర్స్ బాలుర విభాగంలో శ్రీసత్యసాయి జిల్లా జట్టు తరపున ఆడిన అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు అనంతపురం జిల్లా జట్టుతో ఓడిపోయి రన్నర్స్‌గా నిలిచారన్నారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను ఉపాధ్యాయులు అభినందించారు.

కేజీబీవీలో అన్ని వసతులు కల్పిస్తాం

● కలెక్టర్ శ్యాంప్రసాద్


విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

మడకశిర రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గుండుమల కేజీబీవీలో వసతులు కల్పిస్తామని కలెక్టర్ శ్యాంప్రసాద్ అన్నారు. మండలంలోని గుండుమల గ్రామంలో ఉన్న కేజీబీవీ పాఠశాలను ఎమ్మెల్యే ఎంఎస్ రాజుతో కలిసి కలెక్టర్ సోమవారం రాత్రి తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, 250 మందికి కేవలం రెండు బాత్‌రూమ్‌లు మాత్రమే పనిచేస్తున్నాయని, తాగునీటి వసతులు లేక ఇబ్బంది పడుతున్నామని విద్యార్థినులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ స్పందిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని అన్నారు. కేజీబీవీలో వసతులు, విద్యాబోధన, ఉత్తీర్ణత శాతం పెంచేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్‌ఓ, కొంత మంది సిబ్బందితో వివరణ తీసుకున్నామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యావ్యవస్థలో అనేక మార్పులు తెచ్చేందుకు విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ అనేక సంస్కరణలు తీసుకువస్తున్నా అక్కడక్కడా పనిచేస్తున్న ఉద్యోగుల అలసత్వం వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందన్నారు. అలాంటి వారిని ఉపేక్షించేదిలేదన్నారు. కేజీబీవీలో విద్యార్థినులకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి కలెక్టర్, ఎమ్మెల్యే సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

గుట్టిపల్లిలో తాగునీటి ఎద్దడి


చేతిపంపు వద్ద వేచివున్న ప్రజలు

గోరంట్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వానవోలు పంచాయతీలోని గుట్టిపల్లిలో తాగునీటి పథకం బోరు పనిచేయక ఇబ్బంది పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. నెలరోజులుగా బోరుమోటారు మరమ్మతు చేయక పోవడంతో సమస్యగా మారిందన్నారు. నెలరోజులుగా ఒకే చేతిపంపు ద్వారా నీటిని తెచ్చుకుంటున్నారన్నారు. వెంటనే మోటారుకు మరమ్మతు చేయించి సమస్య పరిష్కరించాలని అధికారులను కోరారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహన్‌ను వివరణ కోరగా తాగునీటి పథకం బోరు చెరువులో ఉండడంతో, అది మునిగిపోయిందన్నారు మోటారు వద్దకు వెళ్లేలా మట్టిని వేయించి దారి ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. అప్పటివరకు ప్రజలు ఇబ్బంది పడకుండా ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు.

విధులకు హాజరుకాని ఉపాధ్యాయులపై చర్యలు


గుండుమల కేజీబీవీలో తనిఖీ చేస్తున్న ఎంఈఓ

మడకశిర రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విధులకు సక్రమంగా హాజరు కాని ఉపాధ్యాయులు, సిబ్బందిపై చర్యలు తప్పవని ఎంఈఓ భాస్కర్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని గుండుమల కేజీబీవీని ఎంఈఓ తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం సోషల్ టీచర్ రాకపోవడం, కొంత మంది సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి పనితీరుపై ఉన్నతాధికారులకు నివేదికను పంపనున్నట్లు ఆయన తెలిపారు.

వ్యసనాలకు దూరంగా ఉండండి


జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, విద్యార్థులు

పావగడ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మిమ్మల్ని నమ్ముకొన్న తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మారప్ప సూచించారు. సోమవారం ఎస్ఎస్‌కే రంగ మందిరంలో జిల్లా పంచాయతీ, విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యసనముక్త తుమకూరు అనే కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి పలువురు నాయకులు, అధికారులు మాట్లాడారు. విద్యార్థులు చదువుపై దృష్టిసారించి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు.

విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించండి


తహసీల్దార్ మారుతిని కలిసిన ఎరుకుల సంఘం నాయకులు

గోరంట్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏకలవ్యుడి విగ్రహ ఏర్పాటుకు ప్రభుత్వం స్థలం కేటాయించాలని తహసీల్దార్ మారుతిని ఎరుకుల సంఘం నాయకులు కోరారు. గోరంట్లలో ప్రతి సామాజికవర్గం వారి మూల పురుషుల విగ్రహాలు ఉన్నాయని, తమకు ఏకలవ్యుడి విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించి సహకరించాలని కోరారు. అలాగే ఎరుకుల సంక్షేమ సంఘం కార్యకలాపాలు కొనసాగించడానికి భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. ఎస్టీఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఉమాశంకర్, వన్నప్ప, మాజీ ఎంపీటీసీ మునుస్వామి, నరసింహప్ప, రమణప్ప, సురేష్, శ్రీనివాసులు, క్రిష్ణ పాల్గొన్నారు.

హిందూపురాన్ని జిల్లా కేంద్రం చేయండి


ఐక్యత చాటుతున్న ప్రజాసంఘాల నాయకులు

హిందూపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): హిందూపురాన్ని జిల్లా కేంద్రం చేసేవరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. సోమవారం పట్టణంలోని ఇందిరా పార్కులో వారు సమావేశమయ్యారు. నాయకులు మాట్లాడుతూ హిందూపురాన్ని జిల్లా కేంద్రం చేయడానికి అన్ని అర్హతలు, సదుపాయాలు ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీలకు అతీతంగా ప్రజాసంఘాల్లోకి వచ్చి ఉద్యమానికి సహకరించాలన్నారు. ఇందిరా పార్కు నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. న్యాయవాది ఇందాద్, శ్రీరాములు, ఉమర్ ఫరూక్, డాక్టర్ వెంకటరమణ, రవికుమార్, జమీల్, రామచంద్రారెడ్డి, వన్నూరప్ప, కదిరీష్ పాల్గొన్నారు.

విరాళాల సేకరణ


ఆర్డీఓ ఆనంద్‌కుమార్ నుంచి విరాళాలు సేకరిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

పెనుకొండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఫ్లాగ్ డే సందర్భంగా విరాళాలు సేకరించారు. సోమవారం ఎన్ఎస్ఎస్ పీఓ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ జయప్ప ఆధ్వర్యంలో విద్యార్థులు విరాళాల సేకరించారు. వలంటీర్లు గ్రూపులుగా ఏర్పడి వీధి వీధి తిరిగి దుకాణాలు, హోటల్‌లు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో విరాళాలు సేకరించారు. ఆర్డీఓ ఆనంద్‌కుమార్ అమరవీరులైన జవాన్‌ల కుటుంబాలకు తమ వంతుగా విరాళాన్ని అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఫ్లాగ్ డే ఫండ్‌ను సేకరించి న్యూ ఢిల్లీ కార్యాలయానికి పంపుతున్నట్లు ఎన్ఎస్ఎస్ పీఓ తెలిపారు. మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఎన్ఎస్ఎస్ పీఓ కాంతారావు పాల్గొన్నారు.

బెల్టు షాపులను నియంత్రించండి: సీపీఎం


ఎక్సైజ్ ఎస్ఐకి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

పెనుకొండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): యువత జీవితాలతో చలగాటం ఆడుతున్న గంజాయి, డ్రగ్స్, బెల్టు షాపులను నియంత్రించాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు హరి, బాబావలీ, గంగాధర్, వెంకటరాముడు ఎక్సైజ్ ఎస్ఐకి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంజాయి, డ్రగ్స్, బల్టు షాపులు అధికమయ్యాయన్నారు. రోడ్డు పక్కనే మద్యం షాపులు ఏర్పాటు చేయడం వల్ల మహిళలు ఇబ్బంది పడుతున్నారన్నారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో సందుకొక బెల్టుషాపు వెలిసిందన్నారు. దీంతో యువత మత్తు పదార్థాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. యువతను పెడదోవపట్టిస్తున్న వీటిని నియంత్రించాలన్నారు. యువత, గ్రామీణ ప్రజలకు మత్తుపదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు మహబూబ్ బాషా, నరసింహ పాల్గొన్నారు.

సిమెంటు గోడౌన్‌పై విజిలెన్స్ అధికారుల దాడి

గోరంట్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని గుత్తివారిపల్లి వద్దనున్న సాగర్ సిమెంటు గోడౌన్‌పై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడిచేసి గోడౌన్‌ను సీజ్ చేశారు. గుత్తివారిపల్లి వద్ద కొన్నేళ్లుగా కర్నూలుకు చెందిన మహేష్ అనే వ్యక్తి సాగర్ అనే సిమెంట్ ఫ్యాక్టరీ ద్వారా దిగుమతులు, ఎగుమతులు సాగిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ట్యాంకర్ల ద్వారా సిమెంటును గుత్తివారిపల్లి గోడౌన్‌కు తరలిస్తున్నారు. ఇక్కడ ఫ్యాక్టరీలో అక్రమంగా తయారు చేయించిన వివిధరకాల బ్రాండ్ల ఖాళీ సంచుల్లో సిమెంటును నింపి, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు సమాచారం. డిమాండ్ ఉన్న బ్రాండ్‌ను బట్టి ఒకేరకం సిమెంటును వివిధ బ్రాండ్ల పేరుతో ఆయా సంచుల్లో తరలించడం ద్వారా అక్రమ సంపాదన సాగిస్తున్నారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంటు అధికారి వీబీపీటీఏ ప్రసాద్ ఆధ్వర్యంలో అధికారుల బృందం గుత్తివారిపల్లి సిమెంటు ఫ్యాక్టరీపై దాడిచేశారు. లారీలోని 338 సిమెంటు బస్తాలను, ఖాళీగా ఉన్న 88 అల్ట్రాటెక్ సంచులను సీజ్ చేశారు. అక్రమాలు వెలుగు చూడడంతో సాగర్ సిమెంటు ఫ్యాక్టరీని సీజ్ చేశారు. దాడిలో విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణ, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ గోపాల్, అల్ట్రాటెక్ కంపెనీ సిబ్బంది, జీఎస్టీ సిబ్బంది, బూదిలి, నార్సింపల్లి వీఆర్‌ఓలు సల్మాన్, అనిల్ పాల్గొన్నారు.


గోడౌన్‌ను సీజ్ చేస్తున్న అధికారులు


విద్యార్థినుల సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి సవిత

ఐదెకరాల్లో గిరిజన గురుకుల వసతిగృహం

మంత్రి సవిత

పెనుకొండ టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పెనుకొండ సమీపంలో ఐదు ఎకరాల్లో గిరిజన గురుకుల బాలికల సంక్షేమ వసతి గృహాన్ని నిర్మిస్తామని మంత్రి సవిత అన్నారు. సోమవారం పట్టణంలోని వసతిగృహాన్ని ఆమె ద్విచక్రవాహనంలో వెళ్లి తనిఖీ చేశారు. వసతిగృహంలో వసతులపై విద్యార్థులతో ఆరా తీశారు. అనంతరం సిబ్బంది పనితీరు, వంటగది, మరుగుదొడ్లు తదితరాలను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని త్వరలో పరిష్కరిస్తామని హామీఇచ్చారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండేలా చూడాలని, వైద్యపరీక్షలు తరచూ చేయించాలని అధికారులను ఆదేశించారు. కన్వీనర్ శ్రీరాములు, బాబుల్‌రెడ్డి, ఎగువగడ్డ కృష్ణమూర్తి, షౌకత్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు మంత్రి పరామర్శ


కార్యకర్తలను పరామర్శిస్తున్న మంత్రి సవిత

సోమందేపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలువురు టీడీపీ కార్యకర్తలను సోమవారం మంత్రి సవిత పరామర్శించారు. కేతగానిచెరువు గ్రామానికి చెందిన కార్యకర్త రామాంజినప్ప భార్య ఆదిలక్ష్మీ మృతిచెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన అంజినప్ప అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స తీసుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా ఆయన్ను పరామర్శించి ధైర్యం చెప్పారు. అదే విధంగా సుద్దకుంటపల్లికి చెందిన శివప్రసాద్, ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటుండగా అతని ఇంటికి వెళ్ళి పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. అనంతరం చాలకూరుకు చెందిన వెంకటరమణప్పను పరామర్శించి ఆర్థికసహాయం చేశారు. మంత్రితోపాటు నాయకులు డీవీ ఆంజనేయులు, నీరుగంటి చంద్ర, కన్వీనర్ వెంకటేసులు, సూరి, భానుకీర్తి, సిద్దలింగప్ప, కిష్టప్ప, శివశంకర్‌యాదవ్, శ్రీనివాసరెడ్డి, లోకేంద్ర, నవీన్ పాల్గొన్నారు.

మారిన బస్టాండ్ రూపురేఖలు


ఆర్టీసీ బస్టాండ్ వద్ద టీడీపీ నాయకులు

గోరంట్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మంత్రి సవిత చొరవతో అధ్వానంగా ఉన్న గోరంట్ల ఆర్టీసీ బస్టాండ్ రెండు రోజుల్లోనే రూపురేఖలు మారిపోయాయి. బస్టాండ్ నిరుపయోగంగా ఉండగా, మంత్రి ఆదేశాల మేరకు అధికారులు, పార్టీ నాయకులు ఆదివారం రంగులు వేయించే కార్యక్రమం ప్రారంభించి, ఆవరణలోని గుంతలను మట్టితో చదును చేయించారు. బస్టాండ్ రూపు రేఖలు మారడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ మండల కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి ఆధ్వర్యంలో పలువురు నాయకుల పర్యవేక్షణలో పనులు త్వరగా పూర్తి చేశారు.

అపరిశుభ్రత నడుమ కేజీబీవీ

● ఇబ్బంది పడుతున్న విద్యార్థినులు
● పట్టించుకోని అధికారులు



గుడిబండ కేజీబీవీ పాఠశాల

గుడిబండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరికెర గ్రామ సమీపంలో ఉన్న కేజీబీవీ పాఠశాల అపరిశుభ్రతకు నిలయంగా మారింది. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థినులు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో 250 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలో నీటి సౌకర్యం లేక మరుగుదొడ్లు అపరిశుభ్రంగా మారాయని విద్యార్థులు వాపోతున్నారు. నీటి సౌకర్యం లేక స్నానం చేసేందుకు అవస్థలు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించడంలో ఎస్‌ఓ విఫలమవుతోందని వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి కేజీబీవీ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థినులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.